
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

కృష్ణా జిల్లా వార్తలు

మంగళవారం 11 మార్చి 2025



యథేచ్ఛగా..

ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో రొయ్యల చెరువుల తవ్వకాలు

కోడూరు, మచిలీపట్నం మండలాల్లో అక్రమార్కుల దుశ్చర్య

మచిలీపట్నం, కోడూరు మండలాల్లో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ప్రభుత్వ, అసైన్డ్ భూములను ఆక్రమించి యథేచ్ఛగా రొయ్యల చెరువులను తవ్వేస్తున్నారు. వీటిని అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులు మామూళ్లకు అలవాటుపడి చూసీచూడనట్లు వదిలేస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ అక్రమాలపై ఉన్నతాధికారులకు ఆయా గ్రామాల ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారు.

- చూసీ చూడనట్లు వదిలేస్తున్న రెవెన్యూ అధికారులు
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్న ఆయా గ్రామాల ప్రజలు



కోడూరు మండలం రామకృష్ణాపురంలో అనుమతి లేకుండా రొయ్యల చెరువుల తవ్వకాలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : బందరు వెస్ట్ రెవెన్యూ గ్రామ పరిధిలో ఇటీవల కాలంలో 20 ఎకరాలకు పైగా అసైన్డ్ భూమిని ఎలాంటి అనుమతులు లేకుండా రొయ్యల చెరువులుగా తవ్వుతున్నారు. ఈ అంశంపై అధికారులకు ఫిర్యాదులు అందడంతో వారు ఘటనా స్థలానికి వెళ్లే లోపు యంత్రాలను అక్కడినుంచి తరలించేశారు. మచిలీపట్నం నార్త్ మండల పరిధిలోని కానూరు, పెదపట్నం గ్రామాలకు మధ్యన ఉన్న మడ అడవులను నరికి రొయ్యల చెరువులుగా తవ్వేస్తున్నారు. బంటుమిల్లి, మచిలీపట్నం నార్త్ మండలానికి సరిహద్దున నారాయణపురం, కానూరు గ్రామాల పరిధిలోని మడ అడవులను నరికి వేసి ప్రభుత్వ భూమిని ఆక్రమించి చెరువులుగా మార్పు చేస్తున్నా అటవీశాఖ, రెవెన్యూ అధికారులు ఆవైపునకు కన్నెత్తి చూడటంలేదనే విమర్శలు వస్తున్నాయి.



తుమ్మలచెరువు సమీపంలో రొయ్యల చెరువు

కోడూరు మండలంలో..

కోడూరు మండలం రామకృష్ణాపురంలో ఇటీవల కాలంలో ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో రొయ్యల చెరువుల తవ్వకాలు ఊపందుకున్నాయి. భీమవరానికి చెందిన ఓ బడాబాబు ఈ ప్రాంతంలో 50 ఎకరాలకుపైగా అసైన్డ్ భూములను కొనుగోలు చేసి రొయ్యల చెరువులు మిగతా 6లో..

గ్రామంలోని రొయ్యల చెరువుపై కలెక్టర్‌కు ఫిర్యాదు

మచిలీపట్నం దక్షిణ మండలం పరిధిలోని తుమ్మలచెరువు గ్రామ తాగునీటి చెరువునకు 150 మీటర్ల దూరంలో రొయ్యల చెరువును సాగుచేస్తున్నారు. ఈ రొయ్యల చెరువును ఇటీవల కాలంలో ఉప్పునీటితో నింపారు. గతంలో గ్రామం పక్కనే చెరువు తవ్వుతుంటే గ్రామస్తులు అడ్డుకున్నారు. అప్పట్లో వైసీపీ నాయకుల అండదండలతో చెరువును తవ్వి చేపలు సాగు చేశారు. ఈ ఏడాది చేపల సాగుకు బదులుగా రొయ్యల సాగు చేస్తూ, ఉప్పునీటిని చెరువులో నింపారు. దీంతో ఈ చెరువు పక్కనే ఉన్న పంట పొలాలు, తాగునీటి చెరువుకు, నివాసాలకు ఇబ్బందిగా ఉందని గ్రామస్తులు చెప్పినా చెరువు యజమాని పట్టించుకోలేదు. దీంతో తాగునీటి చెరువుకు ముప్పువాటిల్లే ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తులంతా సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి కలెక్టర్‌కు ఈ అంశంపై ఫిర్యాదు చేశారు. అధికారులను పంపి తుమ్మలచెరువులో తాగునీటి చెరువుకు, పంట పొలాలకు పొంచి ఉన్న ప్రమాదాన్ని గుర్తించాలని గ్రామస్తులు కలెక్టర్‌కు విన్నవించారు.

ఈ స్థలం కోర్టు పరిధిలో ఉందని తెలియజేసే బోర్డును ఆరు నెలల క్రితం ఏర్పాటు చేసిన కళాశాల ప్రిన్సిపాల్ కె.భాగ్యలక్ష్మి



ఎస్ఆర్ఆర్ కాలేజీ భూముల మాయ!

ఆక్రమణ చెరలో 7.25 ఎకరాల భూమి

అందులో 1.25 ఎకరాలను తాజాగా కొనుగోలు చేసిన ఓ కార్పొరేట్ స్కూల్ యాజమాన్యం

- ఆక్రమణలోని భూమి విలువ నేడు రూ.700 కోట్లపైనే
- కళాశాల భూమి కోసం పోరాడుతున్న పూర్వ విద్యార్థులు



ఎస్ఆర్ఆర్ కళాశాల భూముల ఆక్రమణ, అమ్మకాలు, కొనుగోలు వంటి వ్యవహారాలు నేటికీ కొనసాగుతున్నట్లు సమాచారం. తాజాగా ఆక్రమణదారుల నుంచి నగరంలోని ఓ కార్పొరేట్ పాఠశాల యాజమాన్యం 1.25 ఎకరాల స్థలాన్ని రూ.3.50 కోట్లకు కొనుగోలు చేసినట్లు తెలిసింది. ఈ వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. కళాశాల భూముల కోసం పూర్వ విద్యార్థులు పోరాటం చేస్తుంటే.. ఆ భూములు మొదటి నుంచి మావేనని ఆక్రమణదారులు వాదిస్తున్నట్లు సమాచారం.

(ఆంధ్రజ్యోతి, గుణదల): బెజవాడ వాసుల చదువుల నిమిత్తం 1958లో నూజివీడు జమిందారులు మాచవరంలో ఎస్ఆర్ఆర్ కళాశాలకు 7.25 ఎకరాలు ఉచితంగా ఇచ్చారు. చుండూరు వెంకటరెడ్డి, రాజారంగయ్య అప్పారావు ఈ భూమిని ఏపీ ప్రభుత్వానికి బదలాయించినట్టుగా రికార్డులు చెబుతున్నాయి. 1958లో ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చింది. ఆ రోజుల్లో ఖాళీగా ఉన్న భూమిలో గడ్డి సాగు నిమిత్తం లీజుకు తీసుకున్న వ్యక్తి 1968లో రఫ్ పట్టాను పుట్టించి ఆ భూమి తనదేనని వాదిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఇది తమకు ఇచ్చిన భూమి అంటూ కళాశాల యాజమాన్యం కోర్టును ఆశ్రయించినట్లు తెలిసింది. 1982లో రఫ్ పట్టాను రద్దు చేయాలంటూ అప్పటి ఎమ్మార్వో ఉత్తర్వులు కూడా జారీ చేసినట్లు సమాచారం. అయినప్పటికీ భూమికి హక్కుదారులమని చెప్పుకుంటున్న కొందరు వ్యక్తులు ఆనాటి నుంచి ఇప్పటి వరకు కొంతమంది అధికారుల సహాయ సహకారాలతో ఆ భూమిలో ప్లాట్లు వేసి అమ్మేసుకుంటున్నట్లు సమాచారం. కొనుగోలు చేసిన వారు ఇప్పటి వరకు సుమారు 26 ఇళ్లు ఆ భూమిలో నిర్మించినట్లు తెలిసింది.

భూమి కోసం పూర్వ విద్యార్థుల పోరాటం

ఆక్రమణకు గురైన భూమిని ఎలాగైనా సాధించాలన్న పట్టుదలతో కళాశాల పూర్వ విద్యార్థులు సుమారు రెండు వేల మంది సభ్యులతో 2017లో ఒక అసోసియేషన్‌గా ఏర్పడ్డారు. అప్పటి మిగతా 6లో..



కొత్తూరు తాడేపల్లిలో అక్రమ మైనింగ్ జరిగిన ప్రాంతం

లక్ష క్యూబిక్ మీటర్లు తవ్వేశారు!

కొత్తూరు తాడేపల్లిలో మైనింగ్ మాఫియా దారుణం

మొత్తంగా 5.83 ఎకరాల్లో 1.17 లక్షల క్యూబిక్ మీటర్ల ప్రకృతి సంపద తరలింపు

అనుమతులు లేకపోయినా ఉన్నట్టు చూపిన అక్రమార్కులు

కలెక్టర్‌కు నివేదించిన ఎన్‌వోసీలను సంపాదించి.. అవే అనుమతులుగా భ్రమింపజేసి..

బాధ్యులకు షోకాజ్ నోటీసులు జారీ చేసిన జిల్లా యంత్రాంగం

కొత్తూరు తాడేపల్లిలో మైనింగ్ మాఫియా కొత్తరకం మోసానికి తెరతీసింది. కలెక్టర్‌కు నివేదించిన ఎన్‌వోసీలను అనుమతి పత్రాలుగా భ్రమింపజేసి లక్ష క్యూబిక్ మీటర్ల మట్టి, గ్రావెల్ తవ్వుకుపోయింది. అడ్డుకోవాల్సిన అధికారులు అంతా అయిపోయిన తర్వాత అక్కడ తవ్వకాలకు అనుమతి లేదని నిర్ధారించడం వారి పనితీరుకు అద్దం పడుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా అక్రమార్కులు రెచ్చిపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): గత వైసీపీ ప్రభుత్వంలో రెచ్చిపోయిన అక్రమార్కులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా అనుమతులు లేకుండా 1,17,128.91 క్యూబిక్ మీటర్ల మేర గ్రావెల్/మట్టి తవ్వుకుపోయారు. విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో లక్ష క్యూబిక్ మీటర్లకు పైగా మట్టి తవ్వుకుపోయాక కానీ అధికారులు వీటికి అనుమతులు లేవని తేల్చలేదు. మరి ఇన్నాళ్లూ అనుమతులు లేకుండా తవ్వుకుపోతుంటే అధికారులు ఏం చేస్తున్నారు అన్నదానిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా గుట్టుగా కొత్తూరు తాడేపల్లిలో అక్రమ తవ్వకాలు జరిగాయి. ఒక వైపు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమ మైనింగ్‌పై కూటమి ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశిస్తే.. మరో వైపు భయం అనేది లేకుండా మైనింగ్ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరించింది. కొత్తూరు తాడేపల్లిలో అనుమతులే లేకుండా కేవలం ఎన్‌వోసీలను అడ్డం పెట్టుకుని స్థానిక ప్రజలను మభ్యపెట్టి లక్షలాది క్యూబిక్ మీటర్ల మేర మైనింగ్ జరిపారని నిగ్గు తేలటంతో సంచలనంగా మారింది. అక్రమ తవ్వకాలు నిజమేనని తేలడంతో ఇప్పుడు జిల్లా యంత్రాంగం చర్యలకు ఉపక్రమించింది. ఇన్నాళ్లూ సంబంధిత శాఖలు జిల్లా యంత్రాంగాన్ని తప్పుదారి పట్టించడం గమనార్హం.

కొత్తూరు, తాడేపల్లిలో అడ్డగోలుగా తవ్వేశారిలా..

- కొత్తూరు తాడేపల్లి పరిధిలో సర్వే నంబర్ 247/3ఏ1లో ఉన్న సందిపాము ఏసుపాదం పట్టా భూమి 1.51 ఎకరం ఉంటే 1.29 ఎకరంలో అక్రమంగా 13,010.385 క్యూబిక్ మీటర్ల మేర తవ్వేశారు.
- సర్వే నంబర్ 247/3ఏ2లో ఉన్న సందిపాము ఏసుపాదం పట్టా భూమి 0.47 సెంట్లు ఉంటే 0.40 సెంట్లలో 4,801.05 క్యూబిక్ మీటర్ల మేర అక్రమంగా తవ్వకాలు జరిపారు.
- సర్వే నంబర్ 247/3ఏ3లో ఉన్న సందిపాము ఏసుపాదం పట్టా భూమి 0.25 సెంట్లు ఉంటే 0.24 సెంట్లలో అక్రమంగా 1,798.620 క్యూబిక్ మీటర్ల మేర తవ్వేశారు.
- సర్వే నంబర్ 247/3బీలో ఉన్న మిగతా 6లో..

ఉపాధి అవకాశాలపై ప్రణాళికలు సిద్ధం చేయండి

- కలెక్టర్ బాలాజీ 6లో



అర్జీల పరిష్కారంపై దృష్టి సారించండి

- కలెక్టర్ బాలాజీ 6లో

కారు ఢీకొని రైతు మృతి 6లో

- గుడ్లవల్లేరు మండలం అంగలూరు శివారులో ఘటన

ఏనుగులకోడు డ్రెయిన్ మరమ్మతులకు రూ.94 లక్షలు మంజూరు 6లో



ఇఫ్తార్ (సాయంత్రం): 6-21(మంగళ)
సహర్ (ఉదయం): 04-59 (బుధ)

ఇద్దరు ట్రెజరీ ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు

రూ.1.58 కోట్లు దారిమళ్లించిన సీనియర్ అకౌంటెంట్ వెంకటరెడ్డి

- పోలీసులకు జిల్లా ట్రెజరీ అండ్ అకౌంట్స్ అధికారి ఫిర్యాదు
- నిధుల దుర్వినియోగాన్ని సకాలంలో గుర్తించలేదని ఎస్‌టీవో ఆదిశేషుపై చర్యలు

అవనిగడ్డ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ సబ్ ట్రెజరీ కార్యాలయంలో నిధుల దుర్వినియోగం వ్యవహారంలో ఇద్దరిపై ఆ శాఖ సస్పెన్షన్ వేటు వేసింది. తప్పుడు బిల్లులతో రూ.1.58 కోట్లు దారి మళ్లించినట్టు గుర్తించి సీనియర్ అకౌంటెంట్ వెంకటరెడ్డిపై, నిధుల దుర్వినియోగాన్ని సకాలంలో గుర్తించలేదన్న కారణంతో ఎస్‌టీవో ఆదిశేషుపై ఆ శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. గతంలో ఎస్‌టీవోగా పని చేసిన పి.రమేష్ కుమార్‌ను డిప్యూటేషన్‌పై ఇక్కడికి పంపించారు.

జిల్లా ట్రెజరీ అండ్ అకౌంట్స్ అధికారి ఫిర్యాదు

'అవనిగడ్డ సబ్ ట్రెజరీ కార్యాలయంలో సీనియర్ అకౌంటెంట్‌గా పని చేస్తున్న టంటం వెంకటరెడ్డి రూ.1,58,44,569 మొత్తాన్ని డూప్లికేట్ బిల్లులు సృష్టించి దారి మళ్లించారు. 2023లో కేవలం రెండు నెలల కాలంలోనే ఇంత మొత్తాన్ని వెంకటరెడ్డి తన పేరిట ఉన్న ఖాతాలు, తన బంధువుల పేరిట ఉన్న ఖాతాల్లో జమ చేయించారు' అని డిస్ట్రిక్ట్ ట్రెజరీ అండ్ అకౌంట్స్ అధికారి ఎస్.రవికుమార్ అవనిగడ్డ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అవనిగడ్డ సబ్ ట్రెజరీ కార్యాలయంలో వెంకటరెడ్డి 2022, జూలై ఒకటి నుంచి సీనియర్ అకౌంటెంట్‌గా పని చేస్తున్నారని, 2023 జూలై నుంచి సెప్టెంబరు వరకు సీఎఫ్ఎంఎస్ ఫేజ్-2, సీఎంఎఫ్ఎస్ ఫేజ్-1 మధ్య ఉన్న సమన్వయ లోపాన్ని తనకు అనుకూలంగా మలుచుకుని 22 క్లైముల్లో అవకతవకలకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీని కారణంగా ప్రభుత్వానికి రూ.1.58 కోట్ల మేర నష్టం వాటిల్లగా, అందులో నుంచి రూ.1.50 కోట్ల మొత్తాన్ని నాలుగు ఖాతాలకు దారి మళ్లించినట్టుగా తమ విచారణలో వెల్లడైందని ఫిర్యాదులో తెలిపారు. సీనియర్ అకౌంటెంట్‌గా పని చేస్తున్న వెంకటరెడ్డి తన వ్యక్తిగత ఖాతాలకు రూ.60,99,286, ఆయన భార్య శ్రీముఖి అకౌంట్‌కు రూ.56,78,253, తన ఇంటి సమీపంలో టీ దుకాణం నడుపుకునే టి.వి.కిషోర్ పట్వాల్ అకౌంట్‌కు రూ.5,04,266 మొత్తాన్ని దారి మళ్లించినట్టుగా వెల్లడైనట్టు తెలిపారు. చందు కళ్యాణి అనే మహిళ అకౌంట్‌కు రూ.27,63,804 మొత్తాన్ని జమ చేసినట్టుగా డిస్ట్రిక్ట్ ట్రెజరీ అండ్ అకౌంట్స్ అధికారి తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఇల్లు కొంటామంటూ మహిళా ఉద్యోగి ఖాతాలోకి నగదు

గుంటూరు జిల్లా రేపల్లెలోని తన ఇంటిని కొంటామంటూ తన ఖాతాకు డబ్బు మళ్లించి తనను బలి చేశారని బంటుమిల్లి మండలంలో పని చేస్తున్న ఓ మహిళా పంచాయతీ రాజ్ ఉద్యోగి లబోదిబోమంటున్నారు. సదరు మహిళా ఉద్యోగి భర్త మూడేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా, ఆమెకు పెన్షన్ బెనిఫిట్లను అందించటంతోపాటు భర్త ఉద్యోగాన్ని ఇచ్చారు. బంటుమిల్లిలో ఉండి ఉద్యోగం చేసుకుంటుంది. ఈ క్రమంలోనే రేపల్లెలో ఉన్న తన ఇంటిని అమ్మకానికి పెట్టగా, సబ్ ట్రెజరీ కార్యాలయంలో నిధులు దుర్వినియోగానికి పాల్పడిన వ్యక్తులు తాము ఇళ్లు కొనుగోలు చేస్తామంటూ తన ఖాతాకు డబ్బులు వేశారని, ఇప్పుడు తనను సదరు ఉద్యోగి బంధువుగా చూపిస్తున్నారని ఆ మహిళా ఉద్యోగి వాపోతున్నారు.

వెలుగు చూడాల్సినవి ఇంకా ఎన్నో..

2023 జూలై నుంచి సెప్టెంబరు వరకు 22 వ్యవహారాల్లో నిధులను దారిమళ్లించిన సబ్ ట్రెజరీ కార్యాలయ ఉద్యోగులు తర్వాత ఇంకా ఎన్ని నిధులు దారి మళ్లించి ఉంటారోనని పెన్షనర్లు చెవులు కొరుక్కుంటున్నారు. సీనియర్ అకౌంటెంట్‌గా పని చేస్తున్న వెంకటరెడ్డి సీఎంఎఫ్ఎస్ ఫేజ్-2లో రిటైర్ అయిన పెన్షనర్ల వాస్తవ క్లైమ్‌లు పెట్టి వారి ఖాతాలకు ఆ క్లైములు జమ చేసి సీఎంఎఫ్ఎస్ ఫేజ్-1 నుంచి అదే పెన్షనర్ పేరుతో బెనిఫిషరీ అకౌంట్ల పేర్లు మార్చి క్లైములు పొందారని, కేవలం రెండు నెలల కాలంలోనే రూ.1.58 కోట్ల నిధులు దుర్వినియోగం అయితే ఆ తదనంతరం ఇంకా ఎన్ని క్లైములు జరిగాయో నిగ్గు తేల్చకుండా కేవలం విచారణను రెండు నెలల కాలానికే పరిమితం చేశారని పెన్షనర్లు ఆరోపిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారుల సహకారం లేకపోతే ఒక సీనియర్ అకౌంటెంట్ ఈ స్థాయిలో అవకతవకలకు పాల్పడే అవకాశం లేదని, ట్రెజరీ అధికారులు, ఫైనాన్స్ శాఖలో దీనిపై పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించి ఇంకా ఎవరెవరు ఇందులో దోషులుగా ఉన్నారో నిగ్గు తేల్చాలని డిమాండ్ చేస్తున్నారు.



పంటబోదెలోకి దూసుకెళ్లిన కారు, మృతిచెందిన రైతు వెంకటేశ్వరరావు

కారు ఢీకొని రైతు మృతి

గుడ్లవల్లేరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : కారు యాక్టివాను ఢీకొనడంతో యాక్టివా నడుపుతున్న రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. గుడ్లవల్లేరు ఎస్‌ఐ సత్యనారాయణ కథనం మేరకు గుడివాడ గ్రామానికి చెందిన రైతు వి.వెంకటేశ్వరరావు(40) చెన్నూరు గ్రామంలో తన చేనుకు యాక్టివా టూవీలర్‌పై గుడివాడ నుంచి మచిలీపట్నం వెపు వెళుతున్నాడు. మచిలీపట్నం వైపు నుంచి గుడివాడ వెళుతున్న కారు ఎదురుగా వస్తున్న యాక్టివాను అంగలూరు శివార్లలో కామాక్షి ఎస్టేట్స్ సమీపంలో బలంగా ఢీ కొట్టింది. దీంతో రైతు వెంకటేశ్వరరావు ఎగిరి రోడ్డుపక్కన ఉన్న పంటబోది అవతల విద్యుత్ స్తంభంపై పడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్టు స్థానికులు చెబుతున్నారు. కారు నడుపుతున్న వ్యక్తిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.

ఆక్వా రైతుకు సహకారం అందించండి

» ఎంపీ బాలశౌరి డిమాండ్



న్యూఢిల్లీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఏపీలో ముఖ్యంగా మత్స్యకారులు ఎక్కువగా ఉన్న కృష్ణా జిల్లాలో రొయ్యల ఉత్పత్తి, ఎగుమతుల్లో అభివృద్ధి సాధించేందుకు అవసరమైన సాంకేతిక, మౌలిక సదుపాయాలు కల్పించాలని జనసేన పార్లమెంటరీ పార్టీ నేత, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విధాన పరమైన అడ్డంకులను అధిగమించేందుకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. లోక్‌సభలో సోమవారం ఈ అంశాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆక్వా రైతులను స్టడీ టూర్ కింద ఇండోనేషియా, వియత్నాం, చైనా తదితర దేశాలకు తీసుకెళ్లి, అక్కడ ఉత్తమ పద్ధతులను అధ్యయనం చేసే వీలు కల్పించాలని కోరారు. ఏపీలో రొయ్యల పరిశ్రమ దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నప్పటికీ, వాటి ఎగుమతి మాత్రం ప్రోత్సాహకరంగా లేదని తెలిపారు. 2021లో రొయ్యల ఎగుమతుల విలువ ఆరు బిలియన్ డాలర్లకు చేరుకున్నప్పటికీ, గతేడాది ఐదు బిలియన్ డాలర్లకు తగ్గిందన్నారు. సాంకేతిక, మౌలిక సదుపాయాలు కొరత, విధాన సంబంధిత అడ్డంకుల వల్ల రొయ్యల ఉత్పాదకత 1.6 నుంచి నాలుగు మెట్రిక్ టన్నులకు మాత్రమే పరిమితమైందని, ఇండోనేషియా, వియత్నాం, చైనా తదితర దేశాల్లో 12 నుంచి 16 మెట్రిక్ టన్నుల వరకు ఉత్పత్తి జరుగుతోందని తెలిపారు.

శయన బుద్ధ ప్రాజెక్టు పూర్తి చేయండి

» ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్



ఘంటసాల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : నాటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఘంటసాలలో చేపట్టిన శయన బుద్ధ ప్రాజెక్టును పూర్తి చేయాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత వైసీపీ పాలనలో శయన బుద్ధ ప్రాజెక్టు నిర్లక్ష్యానికి గురైన విషయాన్ని అసెంబ్లీ సమావేశాల్లో మండలి ప్రస్తావించారు. అఫ్ఘనిస్థాన్‌లో బుద్ధ విగ్రహాన్ని తాలిబాన్లు బాంబులు పెట్టి పేల్చేశారని, అదేవిధంగా గత వైసీపీ పాలకులు ఘంటసాలలో నిర్మాణంలో ఉన్న శయన బుద్ధ ప్రాజెక్టును పూర్తిగా విస్మరించారంటూ సభ దృష్టికి తీసుకొచ్చారు. మహోన్నత వారసత్వ సంపదకు ప్రతీకగా నిలిచిన గ్రామం తన నియోజకవర్గంలో ఉండటం అదృష్టమన్నారు. నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు శయన బుద్ధ ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేయగా, గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ గొర్రెపాటి రంగనాథ్‌బాబు భూమిని ఉచితంగా ఇచ్చారన్నారు. దీంతో శయన బుద్ధ ప్రాజెక్టు నిర్మాణం రెండు అంతస్థుల శ్లాబ్ పనులు పూర్తి చేయటం జరిగిందన్నారు. నిధులు మంజూరు చేసి నిలిచిపోయిన ప్రాజెక్టును పూర్తి చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై స్పందించిన పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ ఘంటసాలలో బుద్ధ జయంతిని ఘనంగా జరిపిస్తామన్నారు. కేంద్ర సహకారంతో రాష్ట్రంలో బౌద్ధ పర్యాటక అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

ఇండోర్ స్టేడియం అభివృద్ధికి నిధులివ్వండి

» ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా



పామర్రు : నియోజకవర్గ పరిధిలోని మొవ్వ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో గత పాలకుల నిర్లక్ష్యంతో అసంపూర్తిగా నిలిచిపోయిన ఇండోర్ స్టేడియం నిర్మాణం పూర్తి చేసేందుకు రూ.కోటి మంజూరు చేయాలని ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని కోరారు. గత టీడీపీ హయాంలో కళాశాలలో స్టేడియం నిర్మాణం ప్రారంభించి తుదిదశకు చేరుకుంటే.. గత వైసీపీ పాలకులు దానిని పూర్తి నిర్లక్ష్యం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని యూజీసీ గ్రాంట్ నిధులు ఇచ్చి నిర్మాణాన్ని పూర్తిచేయాలని వర్ల కోరారు. దాంతోపాటు గ్రామాల్లో రహదారులు, వంతెనల నిర్మాణాల అవశ్యకతను సభ దృష్టి తెచ్చారు.

అండర్ బ్రిడ్జి, ఫ్లైఓవర్‌లు నిర్మించి ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలి

» ఎమ్మెల్యే బొండా ఉమా



అజిత్‌సింగ్‌నగర్ : సెంట్రల్ నియోజకవర్గంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి నగరానికి అనుసంధానిస్తూ అండర్ బ్రిడ్జిలు, ఫ్లైఓవర్‌లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు కోరారు. సోమవారం అసెంబ్లీలో ఆయన నియోజకవర్గ సమస్యలు, అభివృద్ధిపై ప్రసంగించారు. అజిత్‌సింగ్‌నగర్ ఫ్లైఓవర్‌పై నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని రెండో ఫ్లైఓవర్ నిర్మించి ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని కోరారు. అలాగే గతిశక్తి పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం నిధులతో అండర్ బ్రిడ్జిల నిర్మాణం చేపడుతుందని, ప్రత్యేకంగా ఓ అధికారిని కేటాయించి గుణదల, వాంబేకాలనీ, మధురానగర్ ప్రాంతాల్లో రైల్ ట్రాక్స్ వద్ద అండర్ బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలని సంబంధిత మంత్రులను కోరారు.

ఏనుగులకోడు డ్రెయిన్ మరమ్మతులకు రూ.94 లక్షలు మంజూరు



తోట్లవల్లూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : దశాబ్ధాలుగా ప్రమాదకరంగా మారి పాలకుల నిర్లక్ష్యానికి గురైన పెనమకూరు ఏనుగులకోడు డ్రెయిన్ వంతెన మరమ్మతులకు రూ.94 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈమేరకు ఆర్ అండ్ బీ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే లోకాయుక్తకు నివేదిక సమర్పించారని, జీవో నెంబర్ 350 ద్వారా పెనమకూరు వంతెనకు నాలుగు వైపుల అప్రోచ్‌రోడ్ల నిర్మాణం, శ్లాబు పటిష్టతకు రూ.94 లక్షలు కేటాయించినట్టు నివేదికలో పేర్కొన్నారని సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక ఏనుగులకోడు డ్రెయిన్ దుస్థితిపై పలు వార్తా కథనాలు ప్రచురించిన విషయం తెలిసిందే.



రిక్రియేషన్ ముసుగులో..

పేకాట క్లబ్‌లు!

» ఎన్టీఆర్ జిల్లాలో యథేచ్ఛగా జూదక్రీడలు

» హైదరాబాద్ నుంచి నిర్వాహకుల రాక..

» పోలీసులకు మామూళ్లతో కట్టడి

» మొక్కుబడిగా అధికారుల తనిఖీలు

» పేకాట్ క్లబ్‌లపై ఉక్కుపాదం మోపాలని ప్రజల డిమాండ్

(ఆంధ్రజ్యోతి, నందిగామ) : రిక్రియేషన్ క్లబ్‌ల మాటున జూద క్రీడలకు కొందరు బడాబాబులు పావులు కదుపుతున్నారు. నందిగామ రిక్రియేషన్ క్లబ్‌పై ఇటీవల పోలీసుల జరిపిన ఆకస్మిక దాడులే దీనికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. హైదరాబాద్‌కు చెందిన కొందరు పేకాట నిర్వాహకులు నందిగామ, కంచికచర్ల రిక్రియేషన్ క్లబ్‌లపై దృష్టి సారించారు. స్థానికంగా క్లబ్‌ల నిర్వాహకులు, పలువురు ప్రముఖులతో సంప్రదింపులు జరిపి క్లబ్‌లను వారికి అప్పగించేందుకుగాను ఓ నిర్వాహకుడికి కొంత మొత్తం కూడా ముట్టజెప్పినట్టు సమాచారం. ఈమేరకు స్థానిక నిర్వాహకులు పోలీసులతో బేరసారాలు సాగించి నందిగామ, కంచికచర్లలలోని రిక్రియేషన్ క్లబ్‌లలో పెద్ద మొత్తంలో పేకాట నిర్వహిస్తున్నట్టు ప్రచారం సాగుతోంది. ఇటీవల పేకాట నిర్వహణపై స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా.. నందిగామ సీఐ వైవివిఎల్ నాయుడు క్లబ్‌పై దాడులు నిర్వహించారు. ఆసమయంలో అక్కడ ఎవరూ లేకపోవడం పలు విమర్శలకు దారితీసింది. కంటి తుడుపు చర్యలు కాకుండా పేకాట నిర్వహణపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామాల్లో కాలక్షేపం కోసం చెట్ల కింద పేకాట ఆడేవారిని కాలర్ పట్టుకొని స్టేషన్‌కు తరలించే పోలీసులు క్లబ్‌లలో ఆడే వారిపట్ల ఉదాశీనంగా వ్యవహరించడం ఏంటని విమర్శలు వస్తున్నాయి.



నందిగామ రిక్రియేషన్ క్లబ్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ వైవీవీఎల్ నాయుడు(ఫైల్)

నందిగామ, కంచికచర్ల క్లబ్‌ల్లో.. పేకాట చరిత్ర

నందిగామ, కంచికచర్ల రిక్రియేషన్ క్లబ్‌ల్లో గతంలో పెద్ద ఎత్తున పేకాట శిబిరాలు నిర్వహించారు. 2004-2014 మధ్యకాలంలో ఈ క్లబ్‌ల్లో బాహాటంగానే కోట్ల రూపాయల మేర పేకాట వ్యాపారం సాగింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పేకాటరాయుళ్లు ఇక్కడికి తరలివచ్చేవారు. అలా వారికి సకల సౌకర్యాలు కల్పించిన నిర్వాహకులు కోట్ల రూపాయలు ఆర్జించినట్టు ఆరోపణలున్నాయి. పోలీసులు కూడా వారికి పూర్తి స్థాయిలో సహకరించారని తెలుస్తోంది. కంచికచర్ల సమీపంలోని ఒక రిసార్ట్‌లో పేకాట నిర్వాహకులు హద్దులు దాటి ఏకంగా ఒక ఎస్పీని నిలువరించే స్థాయిలో దందా నడిపారు. రిసార్ట్‌లో పేకాట జరుగుతుందని సదరు ఎస్పీ ఆదేశాలు జారీ చేసినా స్థానిక పోలీసులు పట్టించుకోకపోవడంతో స్వయంగా ఆయనే రిసార్ట్‌లోకి వెళ్లే ప్రయత్నం చేయగా బయట ఎస్పీ ఉండగానే లోపల యథేచ్ఛగా పేకాట నడిపారు. ఎస్పీ వెంట ఉన్న స్థానిక పోలీసులు కూడా నిర్వాహకులకు సహకరించడం అప్పట్లో విస్మయానికి గురి చేసింది. చివరకు ఎస్పీని బదిలీ చేయించింది కూడా పేకాట నిర్వాహకులే అన్న వదంతులు కూడా అప్పట్లో వచ్చాయి. 2014లో చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో క్లబ్‌లపై ఉక్కుపాదం మోపారు. పోలీసుల కఠిన వైఖరితో నిర్వాహకుల ఆటలు సాగలేదు.

జూదక్రీడలపై ఉక్కుపాదం మోపాలి

రాజధానికి సమీపంలో ఇటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరగడం సరికాదని, కూటమి ప్రభుత్వం దీనిపై కఠినంగా వ్యవహరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు ఈ అంశంపై చిత్తశుద్ధితో పనిచేసి క్లబ్‌లలో పేకాట నిర్వహణ అరికట్టాలని కోరుతున్నారు. సామాజిక మాధ్యమాలలోనూ ఇదేఅంశంపై తీవ్ర ప్రచారం జరగడం గమనార్హం.

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికుల రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే అధికారులు వివిధ ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బల్హార్షా, వరంగల్, విజయవాడ, గూడూరు మీదుగా ధనాపూర్ ఎస్ఎంవిటి బెంగళూరు మధ్య వీక్లీ, బై వీక్లీ ప్రత్యేక రైళ్లను నడుపుతున్నారు. ట్రైన్ నెం.03251 ధనాపూర్ నుంచి ఎస్ఎంవిటి బెంగళూరుకు సోమ, మంగళవారం, మార్చి 26 వరకు, ట్రైన్ నెం.03252 ఎస్ఎంవిటి నుంచి ధనాపూర్‌కు మంగళ, బుధవారం మార్చి 28 వరకు ప్రత్యేక రైళ్లు నడపుతున్నట్టు తెలిపారు. ట్రైన్ నెం.03259 ధనాపూర్ నుంచి ఎస్ఎంవిటి బెంగళూరుకు మంగళవారం ఈనెల 11 నుంచి 27 వరకు, ట్రైన్ నెం. 03260 ఎస్ఎంవిటి బెంగళూరు నుంచి ధనాపూర్‌కు బుధవారం ఈనెల 13 నుంచి 29 వరకు రైలు నడపనున్నారు. ఈ ప్రత్యేక రైళ్లు అరంబాక్సర్, దీనదయాళ్ ఉపాధ్యాయ, ప్రయాగ్‌రాజ్, చోకీ, సత్నా, జంబల్‌పూర్, పితాసి, నాగపూర్, సేవాగ్రామ్, చంద్రపూర్, బల్హార్షా, వరంగల్, విజయవాడ, గూడూరు, పెరంబూర్, కాట్పాడి, జోలార్‌పేట, బంగారుపేట, వైట్‌ఫీల్డ్ స్టేషన్ల వద్ద రైళ్లు ఆగుతాయి. కాగా, హోలీ పండగను పురస్కరించుకుని ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు ప్రత్యేక రైళ్లను పొడిగించారు. ట్రైన్ నెం.04121 సుబేదర్‌గంజ్ నుంచి చర్లపల్లికు గురువారం, ఈనెల 13 నుంచి 26 వరకు, ట్రైన్ నె.04122 చర్లపల్లి నుంచి సుబేదర్‌గంజ్‌కు శనివారం ఈనెల 15 నుంచి 29 వరకు అదనంగా ఈ రైళ్లను నడపనున్నారు.

జిల్లాలో జీవనోపాధి పురోభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి



మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వశాఖల ద్వారా జిల్లాలో జీవనోపాధి పురోభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని కృష్ణా కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం డీఆర్‌డీఏ పశుసంవర్ధకశాఖ, వ్యవసాయశాఖ బ్యాంక్ అధికారులు, చేనేత జౌళిశాఖ వివిధశాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈనెల 13న సెర్ప్ సీఈవో జిల్లాకు రానున్నారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉపాధి అవకాశాలు మెరుగు పరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నివేదికలను అన్ని విభాగాల అధికారులు తయారుచేయాలన్నారు. జిల్లాలో నూతనంగా పరిశ్రమలు స్థాపించేవారికి ఎదురువుతున్న ఇబ్బందులు, సంబంధిత సమస్యల పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించేందుకు నివేదికలు తయారు చేయాలన్నారు. సమావేశంలో వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

అనాథపిల్లల సంరక్షణకు చర్యలు తీసుకోండి

శిశుగృహాల్లో ఉంటున్న అనాథపిల్లలను దత్తత తీసుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. బాలల సంక్షేమ పరిరక్షణ కమిటీ సమావేశం కలెక్టరేట్‌లో సోమవారం జరిగింది. జిల్లా న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి కేవీ రామకృష్ణయ్యతో కలిసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అనాథపిల్లలను దత్తత తీసుకునేందుకు వీలుగా వారి వివరాలను సెంట్రల్ అడాప్షన్ రీసోర్స్ అథారిటీ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. అనాథ పిల్లలకు సంబంధించిన ఆధార్‌కార్డులను సేకరించి గ్రామ, వార్డు సచివాలయాల్లో సమర్పిస్తే, ప్రభుత్వం అమలు చేసే సంక్షేమకార్యక్రమాలను వారికి అందేలా చూసేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ ఎంఎన్ రాణి, జడ్పీ సీఈవో కన్నమనాయుడు, డీఈవో ఎంజే రామారావు, సీపీవో గణేష్‌కృష్ణ, డీఎంఅండ్‌హెచ్‌వో శర్మిష్ట, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా సమన్వయకర్త కె.రవికాంత్ పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంపై దృష్టి సారించండి

» కృష్ణా కలెక్టర్ బాలాజీ



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలి శర్మ

మచిలీపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కార వేదిక(మీకోసం)కార్యక్రమం ద్వారా వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించేలా అధికారులు దృష్టి సారించాలని కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లాలోని పలు ప్రాంతాలనుంచి వచ్చిన ప్రజల నుంచి జేసీ గీతాంజలి శర్మ, అధికారులతో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఉగాదినాడు పీ-4సర్వే వివరాలను తెలియజేస్తారని అన్నారు. ఈలోగా పీ-4 సర్వేను పూర్తిచేసేందుకు అధికారులు ప్రత్యేకశ్రద్ధను చూపాలన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థలో ఉద్యోగులు సభ్యులుగా చేరాలని సూచించారు. ఈ-ఆఫీస్ లాగిన్‌లో కొంతమంది జిల్లా అధికారులు ఇంకా చేరలేదని, వారంలోగా చేరాలని, లేకుంటే షోకాజ్ నోటీసులు జారీచేస్తామని హెచ్చరించారు. సమస్యల పరిష్కారంపై ఎండార్స్‌మెంట్‌తోపాటు, రిజిస్టర్‌పోస్టు ద్వారా పంపాలని అధికారులకు సూచించారు. సోమవారం 142అర్జీలను అందజేశారు. కార్యక్రమంలో డీఆర్వో కె.చంద్రశేఖరరావు, కేఆర్‌సీసీ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, మచిలీపట్నం ఆర్డీవో కె.స్వాతి, జడ్పీ సీఈవో కన్నమనాయుడు, డ్వామా పీడీ శివప్రసాద్ యాదవ్, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ, డీపీవో అరుణ, డీఎస్‌వో పార్వతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పార్లమెంటరీ కమిటీ సూచనలు అమలు చేయాలి

» రైతు ధర్నాలో మాజీ మంత్రి వడ్డే



సమస్యలు పరిష్కరించాలని రైతు సంఘాల నేతృత్వంలో లెనిన్ సెంటర్‌లో ధర్నా

గవర్నర్‌పేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మద్దతు ధరలు, రైతులకు ఆర్థిక తోర్పాటు వంటి అంశాలలో పార్లమెంటరీ కమిటీ చేసిన సూచనలు కూడా కేంద్ర ప్రభుత్వం అమలు పరిచేందుకు చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమని రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్, రాష్ట్ర వ్యవసాయశాఖ మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో జరుగుతున్న ఆందోళనల్లో భాగంగా సోమవారం విజయవాడ లెనిన్ సెంటర్‌లో ధర్నా జరిగింది. ధర్నాకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వడ్డే మాట్లాడుతూ, విద్యుత్ సవరణ చట్టాన్ని యథాతథంగా అమలుకు సిద్ధమవడం, మొత్తం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించడానికి, రైతుల అజమాయిషి నుంచి సహకారరంగాన్ని పెట్టుబడిదారులకు అప్పగించడానికి కేంద్రం చూస్తోందన్నారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ, ధరల స్థిరీకరణ నిధిని పునరుద్ధరించి అన్ని పంటల కొనుగోలుకు ప్రభుత్వం ముందుకు రావాలని డిమాండ్ చేశారు. ఏపీ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జల ఈశ్వరయ్య మాట్లాడుతూ, 6 లక్షల ఎకరాల్లో మామిడి తోటలకు ఎర్రవల్లి ఆశించి పూత రాలిపోయిందని, ప్రభుత్వం ఆదుకునే చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ఏపీ రైతు సంఘం నాయకుడు వై.కేశవరావు మాట్లాడుతూ, పంట కాలువలు, డ్రెయిన్లు, ఎత్తిపోతల పథకాలు మరమ్మతు పనులను రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఏపీ కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ, భూయజమాని తీసుకున్న రుణంతో సంబంధం లేకుండా కౌలు రైతులకు పంటరుణాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ధర్నా నుద్దేశించి ఆలిండియా కిసాన్ ఫెడరేషన్ అధ్యక్షుడు రెడ్డి వెంకటరెడ్డి, రైతుకూలీ సంఘం రాష్ట్ర నాయకుడు యు.వీరబాబు, కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, జాగృతి రైతు సంఘం ప్రధాన కార్యదర్శి మరీదు ప్రసాద్ ప్రసంగించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయి, కార్మికసంఘ నాయకుడు కాసాను గణేష్, రైతు నాయకులు రంగారెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్ కాలేజీ భూముల మాయ!

(5వ పేజీ తరువాయి)

నుంచి వారు పార్టీలకతీతంగా పోరాటం చేస్తున్నారు. ఈ స్థలం కోర్టు పరిధిలో ఉంది అని తెలియజేస్తూ కళాశాల యాజమాన్యం, అసోసియేషన్ సభ్యులు ఆక్రమిత స్థలంలో పెట్టిన బోర్డులు తెల్లారేసరికి మాయమవుతున్నట్లు సమాచారం. తాజాగా 20 రోజుల క్రితం 1.25 ఎకరాల స్థలాన్ని నగరంలోని ఓ కార్పొరేట్ పాఠశాల యాజమాన్యం రూ.3.50 కోట్లకు కొనుగోలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. 1977లో ఈ భూమి మొత్తం ప్రజల ఆస్తి అని తెలియజేస్తూ మాస్టర్ ప్లాన్‌లో నమోదై ఉన్నట్లు తెలిసింది. అప్పట్లో కోర్టు ఆదేశాల మేరకు డిప్యూటీ కలెక్టర్ ఆ భూమి మాదే అని చెప్పుకుంటున్న వ్యక్తిని విచారణ చేసిన సమయంలో.. నిజమే ఆ స్థలం ప్రజల ఆస్తి అని మాస్టర్ ప్లాన్‌లో ఉంది అనే విషయాన్ని అంగీకరిస్తూ స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు సమాచారం.

కళాశాలలో చదువుకున్న ప్రముఖులు వీరే

ఎస్ఆర్ఆర్ కళాశాలలో టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు, సిక్కిం మాజీ గవర్నర్ వి.రామారావు, తమిళనాడు మాజీ గవర్నర్ పి.ఎస్.రామ్మోహనరావు, నగర మాజీ మేయర్ జంధ్యాల శంకర్, విజయవాడ వెస్ట్ మాజీ ఎమ్మెల్యే సుబ్బరాజు, మాజీ మంత్రి దేవినేని రాజశేఖర్(నెహ్రూ) ఇలా ఎంతోమంది ఈ కళాశాలలో చదువుకున్నారు. కవి సామ్రాట్ విశ్వనాథ సత్యన్నారాయణ అధ్యాపకుడిగా సేవలందించారు.

దమ్ముంటే.. జగన్ ఇంటి ముందు పోరుబాట చేయండి

» తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు సవాల్



వన్‌టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ నేతలకు దమ్ము, ధైర్యం ఉంటే తాడేపల్లిలోని జగన్ ఇంటి ముందు పోరుబాట చేయాలని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు సవాల్ విసిరారు. ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి 12న వైసీపీ చేపట్టే యువత పోరు కార్యక్రమం పోస్టర్‌ను వైసీపీ దొంగల ముఠా అంతా కలిసి విడుదల చేశారని దుయ్యబట్టారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన సకాలంలో చెల్లించని జగన్ నిరసనకు పిలుపు నివ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఐదేళ్లలో గుర్తుకురాని రీయింబర్స్‌మెంట్, వసతిదీవెన జగన్‌కు ప్రతిపక్షంలో గుర్తుకు వచ్చాయా అంటూ మండిపడ్డారు. విద్యాదీవెన అని గొప్పలు చెప్పి తల్లిదండ్రులతో అప్పులు చేయించి విద్యార్థులను ముప్పతిప్పలు పెట్టి వారిని మానసిక క్షోభకు గురిచేసిన నీచుడు జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెనలకు కోట్లలో బకాయిలు పెట్టి, అందినకాడికి దోచుకున్న జగన్ తాను పెట్టిన బకాయిలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిన జగన్ నీతి మాటలు చెప్పడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఫిబ్రవరిలో ఫీజు పోరు విఫలమవడంతో మళ్లీ ఇప్పుడు యువత పోరు అంటూ డ్రామాలు మొదలు పెట్టాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం రూ.788 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేసిందని, వివిధ కళాశాలల్లో నిలిచిపోయిన 10 లక్షల మంది విద్యార్థులకు సర్టిఫికెట్లను అందేలా చర్యలు తీసుకుందని వెల్లడించారు. వైసీపీ నేతలకు ఏమాత్రం దమ్ము, ధైర్యం ఉన్నా బకాయిలు ఎందుకు పెట్టావని జగన్‌రెడ్డిని ప్రశ్నించాలని, జగన్ ఇంటిముందు ధర్నాకు దిగాలన్నారు. ప్రతిపక్షం కుయుక్తులను విద్యార్థులు, యువత గమనించాలని, స్వార్థ రాజకీయాలకు బలికావద్దని సూచించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు షేక్ నాగూర్, ఏలూరు జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు రెడ్డి చందు, పశ్చిమ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు రాళ్లపల్లి మాధవ, పోలవరం నియోజకవర్గ తెలుగుయువత నాయకులు గన్నిన సురేంద్రనాథ్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

బీసీల అభ్యున్నతే టీడీపీ లక్ష్యం

వన్‌టౌన్ : బీసీల అభ్యున్నతే టీడీపీ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ గౌడ వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరామ ప్రసాద్ గౌడ్ అన్నారు. సోమవారం ఆటోనగర్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీల అభ్యున్నతికి ఎన్టీఆర్ ఎనలేని కృషి చేశారని, ఆయన స్ఫూర్తిగా చంద్రబాబు కూడా బీసీలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. నా బీసీలు అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి బీసీలను ఊచకోత కోస్తే, చంద్రబాబు బడుగు, బలహీన వర్గాలకు ఆర్థికంగా, రాజకీయ బలోపేతానికి కృషి చేస్తున్నారన్నారు.

లక్ష క్యూబిక్ మీటర్లు తవ్వేశారు!

(5వ పేజీ తరువాయి)

నందిపాము ఏసుపాదం పట్టాభూమి 2.60 ఎకరాల్లో 1.60 ఎకరాల్లో అక్రమంగా 11,980.290 మీటర్ల మేర తవ్వకాలు జరిపారు.

- సర్వే నంబర్ 248లో అనుభవదారుగా ఉన్న కొంచా వెంకయ్యకు చెందిన 10.06 ఎకరాల భూమిలో 4.02 ఎకరాల్లో అక్రమంగా 85,538.564 క్యూబిక్ మీటర్ల మేర తవ్వేశారు.

గ్రామస్తుల ఫిర్యాదుతో వెలుగులోకి..

పై సర్వే నంబర్లలో గ్రావెల్, మట్టి తవ్వకోవటానికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. ఇవ్వలేదన్న విషయాన్ని షోకాజు నోటీసుల్లో కూడా పొందుపరిచారు. అవి ఫారెస్టు భూములు అవునో కాదో తెలియజేయడంతో పాటు ఆ శాఖ నుంచి నిరభ్యంతర పత్రం, మైనింగ్, రెవెన్యూ శాఖల నుంచి నిరభ్యంతర పత్రాలు (ఎన్‌వోసీ) మాత్రమే ఇచ్చారు. అది కూడా జిల్లా యంత్రాంగానికి సమాచారం నిమిత్తం తెలపటం జరిగింది. ఎక్కడా అక్రమార్కులకు ఈ ఎన్‌వోసీలు ఇవ్వలేదు. కానీ అక్రమార్కులు ఆయా శాఖలలోని అవినీతి ఉద్యోగులను పట్టుకుని వాటిని సంపాదించారు. స్థానికంగా గ్రామస్తులకు ఇవే చూపించి అనుమతులుగా భ్రమింపజేశారు. దీంతో అనుమతులు ఉన్నాయనుకుని గ్రామస్తులు పట్టించుకోలేదు. ఆ తర్వాత అనుమానం వచ్చి కలెక్టర్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేస్తే అసలు విషయం వెలుగులోకి వచ్చింది. రెవెన్యూ అధికారులు కొద్ది కాలం కిందట అక్రమాలను నిగ్గుతేల్చారు.

నోటీసులు జారీ

మొత్తం 5.83 ఎకరాల పరిధిలో అక్రమ తవ్వకాలు జరిగినట్టుగా నిర్ధారణ కావటంతో బాధ్యులైన వారికి జిల్లా యంత్రాంగం నోటీసులు జారీ చేసింది. విజయవాడ వెస్ట్ బైపాస్ నిర్మాణం చేపడుతున్న కాంట్రాక్టు సంస్థతో పాటు కృష్ణలంకకు చెందిన జానీ బాషా, వాసా నాగరాజు, పోతురాజు మాధవరావులకు నోటీసులు ఇచ్చి, 15 రోజుల లోపు వివరణ ఇవ్వాల్సిందిగా నిర్దేశించింది.

యథేచ్ఛగా..

(5వ పేజీ తరువాయి)

తవ్వారు. అంతటితో ఆగకుండా ఈ చెరువుల పక్కనే ఉన్న ప్రభుత్వ, అసైన్డ్ భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా రొయ్యల చెరువులు తవ్వకం ఇటీవల ప్రారంభించారు. ఈ విషయంపై గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ప్రాంతాన్ని రెవెన్యూ అధికారులు పరిశీలించి అనుమతులు లేకుండా చెరువులు తవ్వుతున్నట్లు గ్రహించి పనులను నిలిపివేయించారు. మందపాకల గ్రామం శివారు చింతకోళ్ల గ్రామం సమీపంలో 50 ఎకరాలకుపైగా ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో రొయ్యల చెరువులు తవ్వుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	90, 97, 107
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

దుర్గగుడి అభివృద్ధికి రూ. లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధికి పోరంకికి చెందిన బెజవాడ రాఘవులు ఈ-హుండీ ద్వారా లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఉద్యోగులు బెజవాడ రాఘవులు కుటుంబ సభ్యులకు అమ్మవారి దర్శనం కల్పించారు. వేదపండితులు వారికి వేద ఆశీర్వచనం అందజేశారు. అనంతరం డీఈఓ రత్నరాజు రాఘవులుకు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రం, లడ్డూ ప్రసాదం అందజేశారు.



దాత రాఘవులుకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ డీఈవో రత్నరాజు

అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : అధికారులు తమ కార్యాలయానికే పరిమితం కాకుండా క్షేత్రస్థాయి పర్యటనలు చేసి ప్రజల సమస్యలు తెలుసుకోవాలని..తద్వారా సమస్యకు పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సూచించారు. సోమవారం తాడిగడప మునిసిపాలిటీలోని పోరంకి ఎస్టీ కాలనీలో ఆయన పర్యటించి సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారం కోసం అధికారులను ఆదేశించారు. ఎస్టీ కాలనీలో డ్రైన్లపూడికలు తీయడం, మంచినీటి సమస్యలను త్వరలో పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. మునిసిపాలిటీలో శానిటేషన్‌పై ప్రధానంగా దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. తాను ఇక నుంచి ఆకస్మిక పర్యటను జరిపి సమస్యలు తెలుసుకొంటానని.. ప్రజల సమస్యలకు పరిష్కారాలు లేనిపక్షంలో అధికారులే బాధ్యత వహించాలని తెలిపారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, మునిసిపల్ కమిషనర్ భవానీ ప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్ కిరణ్, బూక్యా సీతమ్మ, ఫణి, బొంగరాల అబ్రహాం, కొండ, మురళి, వివిధ శాఖల ఏఈలు ఉన్నారు.



పోరంకి ఎస్టీ కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

దుకాణంలో చోరీకి యత్నం

హనుమాన్‌జంక్షన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : స్థానిక విజయవాడ రోడ్డులోని కాకాని కల్యాణ మండపం సమీపంలో శానిటరీ దుకాణంలో గుర్తుతెలియని వ్యక్తి చొరబడి చోరీ యత్నానికి పాల్పడ్డాడు. కానుమోలుకు చెందిన తిరుమల రాజేశ్ శానిటరీ అండ్ ఎలక్ట్రికల్ పరిక రాల షాప్ నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి షాప్ మూసి వెళ్లారు. తిరిగి సోమవారం తెరవడానికి రాగా షట్టర్ తాళాలు పగులకొట్టి ఉండడం గమ నించి నిర్ఘాంతపోయాడు. దొంగలు పడ్డారని గ్రహించి షట్టర్ తీసి షాపంతా పరిశీలించి వస్తువులు, పరికరాలు అపహరణకు గురి కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. షాప్‌లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత ఓ వ్యక్తి కాంప్లెక్సులో అన్ని దుకాణాలను పరిశీలించి చివరికి శానిటరీ షాపు తాళాలు పగులకొట్టి చోరీ యత్నానికి పాల్పడినట్లు తెలిసింది. షాపు యజమాని రాజేశ్ సీసీ ఫుటేజ్‌లు పోలీసులకు అందజేసి ఫిర్యాదు చేశారు.

గన్నవరంలో వైద్యశిబిరం రేపు

గన్నవరం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రిటైర్డ్ ఉద్యోగుల కార్యాలయంలో ఉచిత వైద్యశిబిరం ఈ నెల 12న నిర్వహిస్తున్నట్లు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఆవుటపల్లి మోహనరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిబిరంలో మణిపాల్ హాస్పిటల్ వైద్యులు పాల్గొని గుండె, ఊపిరితిత్తులు, ఈసీజీ, 2డీ ఏకో, క్యాన్సర్‌తో పాటు బీపీ షుగర్ పరీక్షలు, శ్వాస సంబంధిత సేవలు అందిస్తారని తెలిపారు. డాక్టర్ అగర్వాల్స్ కంటి ఆస్పత్రి వైద్యులు కూడా పరీక్షలు చేస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

బస్సు ఢీ కొని ఒకరికి గాయాలు

హనుమాన్‌జంక్షన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద సోమ వారం బస్సు ఢీకొని జంక్షన్‌కు చెందిన చలసాని సతీష్ గాయలకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమలాపురం డిపోకు చెందిన బస్సు విజయవాడ నుంచి అమలాపురం వెళుతూ మార్గ మధ్యలో జంక్షన్ బస్టాండ్ ఇన్‌గేట్ ద్వారా లోపలికి వెళుతుండగా అదే సమయంలో ఎదురుగా జంక్షన్ సెంటర్ నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న సతీష్‌ను ఢీ కొంది. సతీష్‌కు గాయాలు కాగా స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు బస్సును అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



డ్రెయిన్ శుభ్రం చేస్తున్న పంచాయతీ సిబ్బంది

డ్రెయిన్ బాగుజేత

గన్నవరం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కేసరపల్లి శివారు చెంచుల కాలనీలో డ్రెయిన్ బాగుజేత పనులను సోమవారం ప్రారంభించారు. ఆ కాలనీలోని మురుగు స్తంభాల చెరువులో నుంచి బయటకు పోయేది. ఆ చెరువును ఆక్రమణలకు గురైంది. దీంతో నీరు వెళ్లే దారి లేక కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీకి చెందిన ఉప సర్పంచ్ గడ్డం అంకమ్మ సమస్యను సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీమౌనిక, కార్యదర్శి ప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో జేసీబీ, పంచాయతీ కార్మికులతో కలసి డ్రెయిన్ బాగుజేత పనులు చేపట్టారు.

అల్పాహారం పంపిణీ

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : పదవ తరగతి విద్యార్థులకు దాతలు పోషకాలతో కూడిన అల్పాహారం అందజేయడం అభినందనీయమని హెచ్‌ఎం నిర్మల అన్నారు. వీరవల్లి హైస్కూల్‌లోని 110మంది విద్యార్థులకు టీడీపీ నేత మండాది రవీంద్ర సోమవారం అల్పాహారం అందజేశారు. ఎంపీటీసీ అమ్ముతపల్లి సూర్యనారాయణ, రమణగోపాల్ పాల్గొన్నారు.



రవికిషోర్‌కు కేక్ తినిపిస్తున్న మాజీ ఎంపీపీ దేవినేని రాజా

ఘనంగా రవికిషోర్ జన్మదిన వేడుకలు

కంకిపాడు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : కంకిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ డైరెక్టర్ గరికిపాటి రవి కిషోర్ జన్మదిన వేడుకలు సోమవారం ఈడుపుగల్లు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎంపీపీ దేవినేని రాజాను రవికిషోర్ మర్యాదపూర్వకంగా కలిసారు. అనంతరం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన కేక్‌ను రవి కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పందిపాటి ఇందిర, టీడీపీ గ్రామ అధ్యక్షులు షేక్ షకార్, పార్టీ జిల్లా కార్యదర్శి సుధాకర్, కాకుళ్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రత నిబంధనలు పాటించాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన రహదారులపై వాహనాలను నడిపేటప్పుడు ఓర్పు, సహనంతో పాటు భద్రతా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని ఆంధ్రప్రదేశ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ సూచించారు. అంపాపురంలోని ది కృష్ణా డిస్ట్రిక్స్ లారీ ఓనర్స్ అసోసియేషన్ వారి మోడల్ డ్రైవింగ్, ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో హెవీ వెహికల్ శిక్షణ పూర్తి చేసిన 1080వ బ్యాచ్ వారికి సోమవారం సర్టిఫికెట్లను అందజేశారు. రక్తదానం చేసిన ట్రెయినీలను అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు నాగుమోతు రాజా, ఉపాధ్యక్షుడు కె.వి.ఎస్. చలపతిరావు, కార్యదర్శి రావి శరత్‌బాబు, కోశాధికారి పొట్లూరి చంద్రశేఖరరావు, లారీ ఓనర్స్ కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షుడు కోనేరు జగదీశ్వరరావు, కార్యదర్శి పి.వి.శివ రామ ప్రసాద్, డైరెక్టర్ వీరపనేని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



డ్రైవర్లకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఏపీ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్

ఉయ్యూరు- మంటాడ రోడ్డుకు మరమ్మతులు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

ఉయ్యూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు- మంటాడ ఆర్అండ్‌బీ రోడ్డు మరమ్మతులు ఎట్టకేలకు ఆర్ అండ్‌బీ అధికారులు ప్రారంభించారు. బస్టాండ్ సెంటర్ నుంచి మంటాడ వెంకటేశ్వరస్వామి ఆలయం సమీపం వరకు అడుగడుగునా గుంతలు ఏర్పడి ద్విచక్రవాహనాలు సైతం నడిపేందుకు వీలులేక వాహనాలు నడిపేవారు ఇబ్బందులు పడుతున్నారు. గుంతల్లో పడి గాయాల పాలవుతున్న పరిస్థితులను 'అడుగడుగునా గుంతలే' శీర్షికన ఈ నెల 3న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఆర్అండ్‌బీ అధికారులు గుంతలు పూడ్చే పనులకు సోమవారం శ్రీకారం చుట్టారు.



ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

ఉయ్యూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధ పడుతూ ఓ వ్యక్తి ఆదివారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. స్థానిక కొబ్బరితోటలో నివాసముంటున్న కోడదాటి త్రినాథ్(50) శ్రీ నివాస కళాశాల వంతెన సమీపాన ఇస్త్రీ షాఫ్ పెట్టుకుని జీవనం చేస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. త్రినాథ్ తనకు కడుపునొప్పిగా ఉందని రాత్రికి షాపు వద్దనే ఉంటానని కుటుంబ సభ్యులకు చెప్పాడు. సోమవారం ఉదయం ఇంటికి రాకపోవడంతో షాపు వద్దకు వెళ్లి చూడగా చెట్టుకు ఉరివేసుకుని వేలాడుతూ కన్పించాడు. కుమారుడు సాయికృష్ణ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై విశ్వనాథ్ తెలిపారు.

ఇంటర్ విద్యార్థుల మధ్య ఘర్షణ

ఉయ్యూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : రెండు ప్రైవేట్ ఇంటర్ కళాశాలల విద్యార్థులు ఘర్షణకు దిగారు. ఉయ్యూరు పట్టణ పోలీసుల వివరాల ప్రకారం.. స్థానిక ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల పరీక్షా కేంద్రంలో సోమవారం ద్వితీయ సంవత్సరం ఇంటర్ పరీక్ష రాసేందుకువచ్చిన ఉయ్యూరు ఒక ప్రైవేట్ కళాశాల విద్యార్థి యు చింతయ్య, కంకిపాడు ప్రైవేట్ కళాశాలకు చెందిన విద్యార్థి యశ్వంత్ శివ పరీక్ష కేంద్రానికి వెళ్లే ముందు ఒకరి కొకరు మొఖాలు కోపంగా చూసుకున్నారు. పరీక్ష రాసి వచ్చిన తరువాత ఎదురుపడి ఏమిట్రా చూస్తున్నావు అంటూ కలబడ్డారు. ఘర్షణలో చింతయ్యకు గాయం కాగా తోటి విద్యార్థులు కల్పించుకుని కళాశాల బస్సులపై దాడికి పాల్పడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని చెదరగొట్టారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భూ రికార్డులు సరిచేసేందుకే రీసర్వే

గన్నవరం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : భూ రికార్డుల్లో తప్పులను సరిచేసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రీసర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని తహసీల్దార్ కేవీ శివయ్య తెలిపారు. స్థానిక రోటరీ ఆడిటోరియంలో సోమవారం రైతులకు రీసర్వేపై అవగాహన సదుస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూ రికార్డుల్లో ఉన్న కొలతలు, భూమిపై ఉన్న కొలతలు సక్రమంగా ఉన్నాయ లేవా అనే వివరాలను రీసర్వే ద్వారా తెలుసుకోవటం జరుగుతుందన్నారు. ఐఎస్‌వో లీలా ప్రసాద్, డీటీ చిట్టిబాబు, మండల సర్వేయర్ మాధవరావు, వీఆర్వో దియ్యల శ్రీనివాసరావు, విలేజ్ సర్వేయర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ శివయ్య

తిరుపతమ్మ, గోపయ్య స్వామివార్ల కల్యాణం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : వీరవల్లి తిరుపతమ్మ, గోపయ్య స్వామి కల్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా సోమవారం ప్రారంభమయ్యాయి. అమ్మవారికి, స్వామివారికి లంక సురేంద్ర మోహన బెనర్జీ తరఫున కోనేరు కోటేశ్వరరావు, విజయలక్ష్మి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. తదనంతరం మగళవా యిద్యాల మధ్య తిరుపతమ్మ, గోపయ్య స్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. 9 రోజులు జరిగే మహోత్సవాలకు ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త నందమూరి మురళీకృష్ణప్రసాద్, ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు కలపాల నాని, రాజాబాబు, ఆత్మూరి బాలాజీ, లంక రవిశ్రీనివాస్, కాకర్ల గిరిధర్, సతీష్ తదితరులు పర్యవేక్షించారు.



కల్యాణోత్సవంలో భక్తులు

కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లోని కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గొల్లు కృష్ణ నూతనంగా నియమితులైన మండల అధ్యక్షులకు దిశానిర్దేశం చేశారు. మల్లవల్లిలో జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ నండూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో గన్నవరం, బాపులపాడు, ఉంగుటూరు, విజయవాడ రూరల్ మండల అధ్యక్షులకు నియామకపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బాపులపాడు అధ్యక్షుడు ఆళ్ల సాంబశివరావు, గన్నవరం అధ్యక్షుడు గోగులమూడి రవీంద్ర, ఉంగుటూరు అధ్యక్షుడు సాలి కిషోర్‌కుమార్, విజయవాడ రూరల్ అధ్యక్షురాలు సువార్తవాణి, ఝాన్సీరాణి, నిమ్మకూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఆళ్లకు నియామకపత్రాన్ని అందజేస్తున్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గొల్లు కృష్ణ

పీ 4 సర్వే నిరుపేదలకు వరం

ఉయ్యూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ 4 సర్వే నిరుపేదల పాలిట వరమని ఎంపీడీవో సీహెచ్ శేషగిరిరావు అన్నారు. కడవకొల్లులో సోమవారం పర్యటించి గ్రామంలో జరుగుతున్న పీ 4 సర్వేను పరిశీలించారు. గుర్తించిన నిరు పేద వర్గాలను సంపన్న వర్గాలు దత్తత తీసుకుని వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే సర్వే ప్రధాన ఉద్దేశమన్నారు. ప్రజలు సర్వేకు సహకరించాలన్నారు. గ్రామ కార్యదర్శి భవాని పాల్గొన్నారు.

ఉంగుటూరు : సమాజంలో దారిద్ర్యరేఖకు దిగువన ఉండి దుర్భర జీవితాన్ని గడుపుతున్న నిరుపేదలను గుర్తించి, వారి జీవనప్రమాణాలు మెరుగుపరచాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన పబ్లిక్, ప్రైవేట్ పీపుల్స్ పార్టనర్‌షిప్(పీ-4)సర్వేను మండలంలోని అన్ని గ్రామాల్లో సచివాలయ సిబ్బంది ప్రణాళికాబద్ధంగా పక్కాగా నిర్వహించాలని ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ వల్లూరు సూర్యప్రకాష్‌నాథ్ అన్నారు. మానికొండలో జరుగుతున్న పీ-4సర్వేను సోమవారం ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఉదయం వ్యవసాయ పనులకు వెళ్తున్న నేపథ్యంలో సాయంత్రం వేళల్లో సర్వేను వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

తాడిగడపలో ప్రజా చైతన్య యాత్ర

పెనమలూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యల పరిష్కారానికై ఈ నెల 24న జరిగే జనం కోసం సీపీఎం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎం నాయకుల పిలుపునిచ్చారు. సోమవారం తాడిగడప మునిసిపాలిటీలోని కార్మికనగర్, రజక కాలనీలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పుసులూరి లక్ష్మీనారాయణ, విరసం సోమశేఖర్, సీహెచ్ రాంబాబు, పుసులూరి సత్యనారాయణ, నాగదుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఉంగుటూరు : ప్రజల సమస్యలను తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా సీపీఎం ఆధ్వర్యంలో ప్రతిగ్రామంలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి అజ్మీర్ వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం మండలంలోని లంకపల్లిలో పార్టీ నాయకులతో కలిసి ఆయన ప్రజాచైతన్య యాత్ర నిర్వహించారు. ఈకార్యక్రమంలో సీపీఎం గ్రామకార్యదర్శి జైరాజు, నాగరాజు, ఉదయ్‌కుమార్, మార్టిన్, కైలా ప్రసాద్ పాల్గొన్నారు.



తాడిగడపలో పర్యటిస్తున్న సీపీఎం నాయకులు

'పది' విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

కంకిపాడు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రొద్దుటూరు జిల్లా పరిషత్ పాఠశాలలో పది విద్యార్థులకు అవసరమైన ఎగ్జామ్ కిట్స్‌ను దాతలు పతం రామకృష్ణ, సన్నాల ప్రసాద్‌లు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అరుణ కుమారి, ఎస్‌ఎంసీ చైర్మన్ నాగమణి పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : ఏకాగ్రతతో చదివి ఆత్మ విశ్వాసంతో పరీక్షల్లో పాల్గొని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని కల్వరిశక్తి మినిస్ట్రీస్ పాస్టర్ భూక్యా బాలరాజు విద్యార్థులకు సూచించారు. కానుమోలు, రేమల్లె, మల్లవల్లి హైస్కూల్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, జామెట్రీ బాక్స్ తదితర సామగ్రితో కూడిన కిట్లను సోమవారం అందజేశారు.

పోరంకి విద్యార్థికి అమెజాన్‌లో కోటిన్నర ప్యాకేజీ

పెనమలూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : పోరంకికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి అమెరికాలోని అమెజాన్ కంపెనీలో కోటిన్నర రూపాయల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాన్ని సాధించాడు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సులో ఎంఎస్ పూర్తి చేసి బయటికి వచ్చిన వెంటనే పోరంకికి చెందిన ఆరేపల్లి వెంకట సాయి ఆదిత్య అమెజాన్‌కు ఎంపికయ్యాడు. ఆదిత్య చిన్నప్పటినుంచే చదువులో రాణిస్తూ వచ్చాడు. న్యూ యార్క్‌లోని సన్నీ బఫెలో యూనివర్సిటీలో ఎంఎస్ చదివేందుకు వెళ్లాడు. ఎంఎస్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సు కోర్సు పూర్తి చేసి అమెజాన్ సంస్థ 2025లో నిర్వహించిన ఇంటర్వ్యూలకు హాజరై కోటిన్నరతో డెవలప్ ఇంజనీర్‌గా ఉద్యోగం సాధించాడు. ఆదిత్య తండ్రి శ్రీనివాసరావు ఫోటోగ్రాఫర్ కాగా..తల్లి పద్మజ గృహిణి. కోటిన్నర కొలువు సాధించిన ఆదిత్యను పలువురు అభినందించారు.



తల్లిదండ్రులతో ఆదిత్య

రాష్ట్రాభివృద్ధికి కూటమి కృషి

హనుమాన్‌జంక్షన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వ హయాంలో దిగజారిపోయిన రాష్ట్రాభివృద్ధిని తిరిగి గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని బీజేపీ జిల్లా కార్యదర్శి సింగవరపు భాస్కర్ గణేష్ తెలిపారు. సోమవారం ఎమ్మెల్యే కోటా నుంచి ఎమ్మెల్సీగా నామినేషన్ వేసిన బీజేపీ నేత సోము వీర్రాజును విజయవాడ పార్టీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసినట్లు భాస్కర్ గణేష్ తెలిపారు. బీజేపీ యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి యిర్రింకి నాగశ్రీనివాస్ నాయుడు తదితరులు ఉన్నారు.



సోము వీర్రాజుకు మొక్కను అందజేస్తున్న బీజేపీ జిల్లా కార్యదర్శి భాస్కర్ గణేశ్

మహిళల ఆర్థిక స్వావలంబనకు సహకరించాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి) : పురుషులతో సమానంగా వేతన మిస్తూ వయస్సుతో నిమిత్తం లేకుండా ఒంటరి మహిళలు, దివ్యాంగ మహిళలకు రూ. 5వేల పెన్షన్ అందజేయాలని మహిళ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ మండల కో - ఆర్డినేటర్ కొత్తూరి రేఖ డిమాండ్ చేశారు. వీరవల్లిలో ఏపీ మహిళ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మహిళలకు సమాన హక్కులు కల్పించాలని నినాదాలు చేశారు. సభ్యులు అఖిల, మేఘన, సీహెచ్ పండు, మాణిక్యం, భాగ్యమ్మ పాల్గొన్నారు.



వీరవల్లిలో నినాదాలు చేస్తున్న మహిళలు

సాగర్ జలాల్లో మన వాటా విడుదల చేయించండి

● అసెంబ్లీ సమావేశాల్లో గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ



కంచికచర్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జోన్-2, జోన్-3లకు తెలంగాణ నుంచి రావల్సిన 32 టీఎంసీల నీరు అందనందున సుమారు రెండున్నర లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని, ప్రభుత్వం తక్షణమే వాటా ప్రకారం రావల్సిన నీటిని విడుదల చేయించేందుకు చర్యలు చేపట్టాలని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అసెంబ్లీ సమావేశాల్లో కోరారు. సోమవారం సభలో ఆయన మాట్లాడుతూ రెండు జోన్‌లకు 32 టీఎంసీల నీరు విడుదల కావాల్సి ఉన్నా ఇప్పటికీ కేవలం 18 టీఎసీఎంలు మాత్రమే విడుదలయ్యాయన్నారు. తక్షణమే నీరు విడుదల చేయించేందుకు తెలంగాణ ప్రభుత్వంతో చర్చలు జరిపాలని కోరారు. ఇలాంటి సమస్యలకు సత్వర పరిష్కారం దక్కాలంటే కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డును విజయవాడలో ఏర్పాటు చేయించాలని కోరారు. ఎడమ కాలువకు రావాల్సిన నీటిపై ఆంధ్రజ్యోతిలో కథనం ప్రసారమైంది. ఈ క్రమంలో ఎమ్మెల్యే యార్లగడ్డ ఈ అంశంపై అసెంబ్లీలో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. తక్షణమే తెలంగాణ అధికారులతో మాట్లాడి ఏప్రిల్ 15 వరకూ సాగర్ జలాలు విడుదల చేయించాలని కోరారు.

సీలింగ్ భూముల సమస్యను పరిష్కరించాలి

● అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య



జగ్గయ్యపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సీలింగ్ భూముల సమస్యపై ఎన్టీఆర్ జిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని ఒక పరిష్కారాన్ని కనుగొనాలని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరారు. ఆయన సోమవారం అసెంబ్లీలో ఈ సమస్యను ప్రస్తావించారు. 1973లో ల్యాండ్‌సీలింగ్ చట్టం వచ్చిందని, 50 ఏళ్లయినా ఆ భూములపై వివాదాలు పరిష్కారం కాలేదని, రెవెన్యూ రికార్డుల్లో ఆడంగళ్లు పాడైపోతున్నాయని, జిల్లా కార్యాలయాల్లోనూ రికార్డులు కనిపించకుండా పోతు న్నాయన్నారు. వేల ఎకరాల సీలింగ్ భూములు బయటకు వస్తే పేదల అవసరాలకు, అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించుకోవచ్చన్నారు. న్యాయస్థానాల్లోనూ కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఈ సమస్యకు ఎన్టీఆర్ జిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని చక్కటి పరిష్కారం కనుగొనాలని కోరారు.

అన్న క్యాంటీన్‌లో అల్పాహారం

సోమవారం అసెంబ్లీకి వెళ్లేముందు ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య జగ్గయ్య పేట అన్నా క్యాంటీన్‌లో అల్పాహారం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన వివిధ వర్గాల ప్రజలు, కార్మికులు, శ్రామికులతో కలిసి అల్పాహారం తీసుకుంటూ వారి సమస్యలు తెలుసుకున్నారు. ఆహారం ఎలా ఉంటుందో అడిగి తెలుసుకున్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు చెక్కును అందజేస్తున్న ఎన్టీఆర్, వెటర్నరీ కాలనీల ప్రముఖులు దాసరి హరికృష్ణ, మలినేని రంగప్రసాద్, పొట్లూరి దర్శిత్

సీఎం సహాయ నిధికి రూ.25లక్షల విరాళం

భారతీనగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ఎన్టీఆర్, వెటర్నరీ కాలనీల ప్రముఖులు సీఎం సహాయనిధికి రూ.25లక్షలను సోమవారం అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న సుపరిపాలనకు తమ వంతు సహాయంగా ముఖ్యమంత్రి సహాయనిధికి ఈ నిధులు అందజేశామని విజయవాడ తూర్పు నియోజకవర్గం మాజీ అధికార ప్రతినిధి, ఎన్టీఆర్ కాలనీ ప్రముఖుడు దాసరి హరికృష్ణ, వెటర్నరీ కాలనీ అసోసియేషన్‌కు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త మలినేని రంగప్రసాద్, టీడీపీ నేత పొట్లూరి దర్శిత్ అసెంబ్లీ వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి రూ.25లక్షల చెక్కును విరాళంగా అందజేశారు.

చట్టసభలన్నా, ప్రజలన్నా జగన్‌కు గౌరవం లేదు

● మాజీమంత్రి దేవినేని ఉమా

గొల్లపూడి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ రెడ్డికి ప్రజలన్నా, చట్టసభలన్నా గౌరవం లేదని మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. గొల్లపూడిలో ఆయన సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ ఐదేళ్లలో గుర్తుకు రాని రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన జగన్‌కు ప్రతిపక్షంలో ఉండగా గుర్తుకొస్తున్నాయన్నారు. రైతు పోరు అట్టర్‌ప్లాప్ అయినా బుద్ది రాలేదన్నారు. ఆవిర్భావ దినోత్సవంలో 10 మందిని పోగేసుకొని నాటకాలాడుతున్నాడన్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం రూ.788కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేసిందన్నారు. ప్రజల సొమ్మును దోచేసిన వైసీపీ దొంగలపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఉమా హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో న్యాయవాది మృతి



గుణదల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో న్యాయవాది మృతిచెందిన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. ఈ మేరకు మాచవరం పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. గుణదల రైస్‌మిల్ రోడ్డులో నివాసముంటున్న కోట జయరాజు (65) న్యాయవాదిగా పనిచేస్తున్నాడు. ఆయనకు స్థానిక ఎస్ఆర్ఆర్ కళాశాల సమీపంలో కార్యాలయం ఉంది. ఆదివారం రాత్రి ఓ క్లైయింట్‌తో మాట్లాడి యాక్టివాపై ఇంటికొస్తుండగా గుణదల వంతెన సెంటర్ వద్ద రామవరప్పాడు వైపు నుంచి మోటారు బైక్‌పై వస్తున్న యువకుడు ఢీకొట్టాడు. దీంతో జయరాజు తలకు బలమైన గాయమవడంతో ఆసుపత్రికి తరలించిన కొద్దిసేపటికే చనిపోయినట్టు ప్రభుత్వాసుపత్రి వైద్యులు నిర్ధారించారు. మాచవరం ఎస్ఐ శ్రీనివాస్ ఘటనాస్థలానికి చేరుకుని పూర్వాపరాలు సేకరించారు. మోటారు బైక్‌పై ప్రయాణిస్తున్న డి.సిద్ధి (25)కి కూడా చేతికి ప్యాక్చర్, తలకు స్వల్పగాయాలవ్వడంతో ఎంజే నాయుడు ఆసుపత్రికి తరలించారు. ఈ యువకుడు గురునానక్ నగర్లో నివాసముంటున్నాడు. అతడిని జిల్లా అదనపు మేజిస్ట్రేట్ బంధువుగా పోలీసులు గుర్తించారు. మృతుడి బావమరిది కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. జయరాజు మరణవార్త తెలుసుకున్న బార్ అసోసియేషన్ నుంచి న్యాయవాదులు పెద్ద సంఖ్యలో మార్చురీ వద్దకు చేరుకుని మృతదేహాన్ని చూసి కంటతడిపెట్టారు.

తాడేపల్లి ప్యాలెస్‌కు అసమ్మతి వివాదం!

తిరువూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీలో అవిశ్వాసం పంచాయితీ తాడేపల్లి ప్యాలెస్‌కు తీసుకువెళ్లేందుకు స్థానిక పార్టీ అధిష్ఠానం సూచించినట్టు సమాచారం. సోమవారం వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు సమక్షంలో వైసీపీ కౌన్సిలర్లతో పలు అంశాలపై చర్చించినట్టు తెలుస్తోంది. మంగళవారం జరిగే కౌన్సిల్ సమావేశం అజెండా నోటీసులు ఎందుకు తీసుకోలేదని కొందరు సభ్యుల్ని ప్రశ్నించగా తమను సంప్రదించకుండా అజెండా రూపొందించారని ఈ విధానం నచ్చకే తిరస్కరించినట్టు తెలిపారు. మంగళవారం కౌన్సిల్‌కు సభ్యులందరూ హాజరుకావాలని స్వామిదాసు సూచించారు. అలాగే అవిశ్వాసం అంశంపై సభ్యులతో చర్చించిన ఆయన పార్టీ అధ్యక్షుడు జగన్మోహనరెడ్డి అపాయింట్‌మెంట్ తీసుకుంటానని, పార్టీ కౌన్సిలర్లందరూ వెళ్లి, అధ్యక్షుడి సూచన మేరకు నిర్ణయం తీసుకుందామనే ప్రతిపాదన తెచ్చారు. ఏదేమైనా బోర్డుపై అవిశ్వాసం పెట్టాల్సిందేనని భీష్మించిన సభ్యులు, తామంతా తాడేపల్లికి రానవసరం లేదని, మీరే పార్టీ అధ్యక్షుడ్ని కలిసి అవిశ్వాసంపై చర్చించి, తుదినిర్ణయం తీసుకోవాలని సూచించినట్టు తెలిసింది.

27న బెజవాడ బార్ ఎన్నికలు

● 15న నోటిఫికేషన్, 17,18,19న నామినేషన్ల స్వీకరణ

● 20న ఉపసంహరణ, అదేరోజు ఫైనల్ లిస్ట్ ప్రకటన

విజయవాడ లీగల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): బెజవాడ బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 27న నిర్వహించనున్నట్టు బెజవాడ బార్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొత్త చంద్రమౌళి, అరిగెల శివరాం ప్రసాద్ (రాజా) తెలిపారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీసింగ్ (సీఓపీ) న్యాయవాదుల లిస్టును మార్చి 5న నోటీసు బోర్డులో ఉంచడం జరుగుతుందని, బెజవాడ బార్ అసోసియేషన్ ప్రిలిమినరీ ఓటర్స్ లిస్ట్ మార్చి 7న ప్రకటించనున్నట్టు తెలిపారు. ఈనెల 15న ఫైనల్ ఓటర్స్ లిస్టును ప్రకటించడం, అదేరోజు ఎలక్షన్ నోటిఫికేషన్ కూడా ప్రకటిస్తారన్నారు. 17, 18, 19న ఉదయం 11 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. 19న సాయంత్రం 4.30 గంటల తర్వాత నామినేషన్ల పరిశీలన ఉంటుందని, 20న నామినేషన్ల ఉపసంహరణ, అదే రోజు సాయంత్రం 5 గంటల తర్వాత నామినేషన్ల ఫైనల్ లిస్టును ప్రకటిస్తారన్నారు. 27న ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, సాయంత్రం 5 గంటల తర్వాత నుంచి రాత్రి వరకు కౌంటింగ్ జరుగుతుందన్నారు.

రేపు పార్శిళ్లు బహిరంగ వేలం

బస్టేషన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఆర్టీసీ పార్శిళ్ల విభాగంలో నెలల తరబడి ఉన్న పార్శిళ్లకు, కస్టమర్లు బుక్ చేసుకుని వదిలేసిన పార్శిళ్లకు ఈనెల 12న పండిట్ నెహ్రూ బస్టేషన్ పార్శిల్ కార్యాలయం వద్ద బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్టు ఆర్టీసీ ఏటీఎం (కమర్షియల్) సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వేలంపాటదారులు వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

రారండోయ్.. వేడుక చూద్దాం..!

● రేపటి నుంచి నెమలి బ్రహ్మోత్సవాలు.. రుక్మిణీ కృష్ణ కల్యాణం

నెమలి వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలకు సమయం ఆసన్నమైంది. ఈ నెల 12 నుంచి 17 వరకు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయం సిద్ధమైంది. సుమారు 72 ఏళ్ల క్రితం కుగ్రామంగా ఉన్న నెమలి గ్రామంలో వేణుగోపాలస్వామి స్వయంభూగా వెలియడంతో, రాష్ట్రవ్యాప్తంగా పేరుగాంచింది. ప్రతి ఏడాది స్వామి కల్యాణం సందర్భంగా ఉభయ రాష్ట్రాల నుంచే కాకుండా, ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు ఈ వేడుకలో పాల్గొంటారు. స్వామి విగ్రహం భూమిలో దొరికింది మొదలు, ఆలయం నిర్మాణం, ధ్వజస్తంభ ప్రతిష్ఠ సమయంలో జరిగిన సంఘటనలన్నీ స్వామి లీలాలేనని భక్తులు నమ్ముతుంటారు. భక్తుల విరాళాలతో నిత్యన్నా దానంతోపాటు గోశాల కూడా నడుస్తోంది.

\- ఆంధ్రజ్యోతి, తిరువూరు/గంపలగూడెం

భక్తుల కోర్కెలు తీరుస్తూ ప్రముఖ పుణ్యక్షేత్రంగా అలరారుతున్న నెమలి గ్రామంలో ఏటా జరిగే స్వామివారి బ్రహ్మోత్సవాలకు భక్తులు లక్షలాదిగా తరలి వస్తుంటారు. ఈ మేరకు బ్రోచర్‌ను అర్చకులు, దేవాలయ సిబ్బంది సమక్షంలో ఈవో నేల సంధ్య ఆవిష్కరించి ఉత్సవాలకు ఆహ్వానం పలికారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల ప్రజలతో పాటు ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు ఈ ఉత్సవాల్లో పాలు పంచుకోనున్నారు.

ఆలయ చరిత్ర

పూర్వం నెమలి గ్రామానికి చెందిన వనమా శీతారామయ్య తన పొలంలోకి



వేణుగోపాలస్వామి ఆలయం

సామవంతమైన మట్టి కోసం దారా నర్సయ్య పొలం నుంచి మట్టి గొనుగోలు చేసి మటి తవ్వేందుకు సిద్ధపడ్డాడు. 1953 మార్చి 23న ఆయన వద్ద పాలేరుగా పనిచేసే కఠారు వెంకటేశ్వర్లు మట్టిని తవ్వుతుండగా ఖంగుమని మెరుపుతో కూడిన శబ్దం వచ్చింది. మరోసారి తవ్వగా వచ్చిన మెరుపునకు వెంకటేశ్వర్లు స్పృహ కోల్పోయాడు. కూలీలు సపర్యలు చేసి ముఖంపై నీళ్ల చల్లగా, మేలుకున్న అతడు తనకేమీ కనిపించడం లేదని చెప్పాడు. కూలీలు ఆశ్చర్యానికి గురై అక్కడ తవ్విచూడగా విగ్రహం బయటపడింది. అప్పుడు శ్రీరామనవమి కావడంతో వనమా శీతారామయ్య, స్వామి కల్యాణ ఏర్పాట్లలో ఉన్నారు. కూలీలు ఈ విషయం చెప్పగా ఏర్పాట్లను వేరొకరికి అప్పగించి గ్రామ పెద్దలతో కలిసి విగ్రహం బయటపడిన ప్రదేశానికి వెళ్లాడు. పెద్దలు ఆ విగ్రహాన్ని పరిశీలించి వేణుగోపాల స్వామి విగ్రహంగా గ్రహించారు. అదే సమయంలో గ్రామంలోని కొందరి కలలో స్వామి కనిపించి తాను వెలిసిన చోటనే ఆలయం నిర్మించాలని తెలిపినట్టు పూర్వీకులు చెబుతుంటారు. దీంతో 1957 ఫిబ్రవరి 6న వేదమంత్రాల నడుమ స్వామివిగ్రహ ప్రతిష్ఠ చేశారు. అప్పటి నుంచి ప్రతి ఏడాది స్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహిస్తుంటారు. ప్రతి సోమవారం, శుక్రవారం పెద్దసంఖ్యలో భక్తులు వచ్చిన స్వామిని దర్శించుకుంటారు.

ధ్వజస్తంభం ప్రతిష్ఠలోనూ స్వామి లీల

వేడుగోపాల స్వామి ఆలయం నిర్మాణం సమయంలో ధ్వజస్తంభాన్ని నెమలి గ్రామానికి సమీపంలోని దాచాపురంలో తయారు చేయించారు. ఎడ్లబండిపై తీసుకొస్తుండగా నెమలి గ్రామం వద్ద వాగు (అనురాధా వాగు) ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆలయం, ధ్వజస్తంభ ప్రతిష్ఠకు ముహూర్తం సమీపిస్తుండంతో భక్తుల్లో ఆందోళన రేకెత్తించింది. ఈ క్లిష్టపరిస్థితిని ఎలా ఎదుర్కోవాలో తెలియక స్వామిని వేడుకున్నారు. దీంతో అప్పటి వరకు ఉధృతంగా ప్రవహించిన వాగు రెండు పాయలుగా చీలి ధ్వజస్తంభం దాటిన తరువాత యథావిధిగా ప్రవహించిందనే విషయాన్ని పెద్దలు చెపుతుంటారు.



ఆలయ ప్రాంగణంలో గోశాల

ప్రత్యేక రవాణా సౌకర్యం

శ్రీవేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు, కల్యాణ వేడుకను వీక్షించేందుకు దూరప్రాంత భక్తులు నెమలి పుణ్యక్షేత్రానికి చేరుకునేందుకు, ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు నిర్వహిస్తోంది. విజయవాడ, తిరువూరు, మధిర, ఖమ్మం, వైర నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులున్నాయి. బ్రహ్మోత్సవాల సమయంలో తిరువూరు, మధిర, వైరా నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నారు. మైలవరం ఏసీపీ, తిరువూరు సీఐ ఆధ్వర్యంలో పూర్తిస్థాయిలో బందోబస్తు నిర్వహిస్తారు.

నీటి విడుదలకు భగీరథయత్నం

● దిగువ ప్రాంతాలకు నీటి విడుదలకు తెలంగాణ అధికారులతో చర్చ

● విడుదల చేస్తామంటూ హామీ

● ఫలించనున్న నందిగామ డిస్ట్రిబ్యూటరీ కమిటీ నేతల యత్నం



అధికారులు, ఎగువ ప్రాంతాల రైతులతో మాట్లాడుతున్న చైర్మన్ రాటకొండ చంద్రశేఖర్

నందిగామ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆయకట్టుకు సాగునీరందించేందుకు నందిగామ డిస్ట్రిబ్యూటరీ కమిటీ భగీరథ ప్రయత్నం చేస్తోంది. తెలంగాణలోని చెర్వుమాధవరం ట్యాంక్ నుంచి ఆదివారం 650 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. సీఎం ట్యాంక్ నుంచి 6.8 కిలోమీటర్ల మేర తెలంగాణ భూభాగం ఉంది. ఆ ప్రాంత రైతులు సుమారు 200 క్యూసెక్కుల నీటిని వినియోగించుకుంటున్నారు. అక్కడ నుంచి గండ్రాయి సెక్షార్, శనగపాడు-1, శనగపాడు-2 ద్వారా 300 క్యూసెక్కుల నీటిని అక్కడి రైతులు వినియోగించుకుంటున్నారు. దీంతో కంచల, ఏటూరు మేజర్లకు బండిపాలెం రెగ్యులేటర్ వరకూ కేవలం 150 క్యూసెక్కుల నీరు మాత్రమే విడుదలవుతోంది. 529 క్యూసెక్కుల నీరు రావల్సి ఉండగా కేవలం 150 క్యూసెక్‌లే వస్తుండడంతో కంచల, ఏటూరు మేజర్ రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో నందిగామ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ రాటకొండ చంద్రశేఖర్, నీటి సంఘాల అధ్యక్షుడు సోమవారం ఎన్‌హెచ్ రెగ్యులేటర్ వద్దకు చేరుకొని అధికారులతో చర్చలు జరిపారు. ఆయకట్టులో మాగాణీ, మొక్కజొన్న పంటలు ఎండిపోయే దశకు చేరుకున్నాయని, దిగువకు వస్తున్న పూర్తి నీటిని రెండు రోజుల పాటు తమకు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత విడత విడుదలైన మొత్తం ఎగువ ప్రాంతం రైతులు వాడుకున్నందున ప్రస్తుతం తమకు వదిలేయాలని కోరారు. అక్కడి రైతులతో కూడా సుదీర్ఘ చర్చలు జరిపిన చంద్రశేఖర్ గురువారం ఉదయం వరకూ తమకు వదలి, అనంతరం ఎగువ రైతులకు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. చంద్రశేఖర్ సూచన మేరకు అధికారులు శనగపాడు మేజర్లకు నీటిని నిలిపివేసి పూర్తి నీటిని దిగువకు విడుదల చేశారు. దీంతో కంచల, ఏటూరు మేజర్లకు సుమారు 450 క్యూసెక్కుల నీరు అందుతుంది. సుబాబుల్ రైతులు ఈ నీటిని వినియోగించవద్దని చంద్రశేఖర్ రైతులను కోరారు. కేవలం వరి, మొక్కజొన్న, మిర్చి రైతులు మాత్రమే నీటిని వినియోగించుకోవాలని కోరారు. ఎన్ఎస్‌పీ ఈఈ సంతోషరావు, డీఈ సుబ్బారావు, ఏఈ నాగరాజునాయక్, జగ్గయ్యపేట నియోజకవర్గ టీడీపీ నేతలు ఏలూరు గోపాలరావు, కట్టా నరసింహారావు, ముల్లంగి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వాననీటి సంరక్షణతో
భూగర్భ జలాలకు కొత్త జీవం

● సమీక్ష సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వాననీటి సంరక్షణతో భూగర్భ జలాలు పెరుగుతాయని, ఆహార భద్రతకు భరోసా కల్పించడంలో భూగర్భజలాలది కీలకపాత్ర అని జిల్లాలో జల్ సంచయ్ జన్ భాగీదరి (ఏఎస్ఎస్‌బీ)ని మరింతగా ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. సోమవారం కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన న్యూఢిల్లీ నుంచి వర్చువల్‌గా జల్‌శక్తి అభియాన్-క్యాచ్ ది రెయిన్, జల్ సంచయ్ జన్ భాగీదరిపై సమీక్ష సమావేశం జరిగింది. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ లక్ష్మీశ, డ్వామా, భూగర్భ జలాలు, గ్రామీణ నీటి సరఫరా విభాగాల అధికారులతో కలిసి హాజరయ్యారు. జల్ సంచయ్ జన్ భాగీదరి కింద అమలవుతున్న కార్యక్రమాలు, ప్రస్తుత స్థితిగతులు, భవిష్యత్ కార్యాచరణపై మంత్రి మార్గనిర్దేశం చేశారు. వీసీ అనంతరం కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో మాట్లాడుతూ ఒకవైపు వాననీటి సంరక్షణతో పాటు భూగర్భ జలాల దుర్వినియోగాన్ని అడ్డుకోవడమూ ముఖ్యమని, వర్షపు నీటి సంరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఈ దిశగా చేసే ప్రయాణంలో జిల్లాలో జల్‌సంచయ్ జన్ భాగీదరిలో ప్రగతికి చేయి చేయి కలపాలన్నారు.

'ఒక రైతు-ఒక నీటికుంట' నినాదంతో ముందుకు..

ఉపాధి హామీ పథకం అనుసంధానంతో పైసా ఖర్చు లేకుండా రైతుల పొలాల్లో నీటికుంటల వల్ల పంటకు కావాల్సిన నీరందడమే కాక భూగర్భజలాల వృద్ధికి దోహదపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో 289 గ్రామ పంచాయితీల పరిధిలో 2,713 కుంటలు మంజూరయ్యాయని, వీటి పనులు త్వరగా పూర్తయ్యేలా అధికారులు కృషిచేయాలన్నారు. 440 అంగన్‌వాడీ కేంద్రాల్లో రూఫ్ టాప్ వాన నీటి సంరక్షణ నిర్మాణాలు మంజూరుకాగా ఇప్పటికే 100 పూర్తయినందున మిగిలిన వాటినీ పూర్తిచేసేందుకు కృషిచేయాలన్నారు. గత నెల 3వ శనివారం పైలట్ ప్రాజెక్టుగా 1,350 ఇంకుడు గుంతలు మంజూరు చేశామని, దీన్ని జిల్లా అంతటా ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. డ్వామా పీడీ ఎ.రాము, భూగర్భ జలాల డిప్యూటీ డైరక్టర్ నాగరాజు, గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ విద్యాసాగర్ పాల్గొన్నారు.





ప్రజా సమస్యలను వింటున్న కలెక్టర్ లక్ష్మీశ, పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, అధికారులు

జిల్లాను అగ్రస్థానంలో నిలుపుదాం

● గ్రీవెన్స్ డేను సమర్థంగా నిర్వహించండి ● జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌కు 152 అర్జీలు: కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం (పీజీఆర్ఎస్)కు వచ్చే అర్జీల పరిష్కార నాణ్యతలో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ లక్ష్మీశ, డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతితో కలిసి ప్రజల నుంచి 152 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కార నాణ్యతపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారిస్తోందని, డివిజనల్, మండల స్థాయిలోనూ గ్రీవెన్స్ డేను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేడు సామూహిక ఎలుకల నిర్మూలన

ఈనెల 11న జిల్లాలోని వరిసాగుచేసే గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సామూహిక ఎలుకల నిర్మూలన జరుగుతుందని, దీంతో పంటకు రక్షణ లభిస్తుందని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సమగ్ర ఎలుకల యాజమాన్యం (రబీ 2025)పై రూపొందించిన ప్రత్యేక పోస్టర్లను సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ లక్ష్మీశ, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పొలాలు, గట్లపై సజీవ ఎలుకల బొరియలను గుర్తించి, వాటిలో బ్రోమోడయోలోన్ మందు కలిపిన ఎరను 10 గ్రాముల చొప్పున వేసి మూసేయాలన్నారు. రైతులు ఈ ఎరను వీఏఏల నుంచి ఉచితంగా పొందొచ్చన్నారు. డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, జిల్లాపశుసంవర్ధక అధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు, సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా చలివేంద్రాలు


వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకొంటున్నామని, దాతల సహకారంతో జిల్లావ్యాప్తంగా చల్లటి మజ్జిగ, తాగునీటిని సరఫరా చేసేలా చలివేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకొన్నామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. కలెక్టర్ కార్యాలయానికి విచ్చేసే సందర్శకులు, అధికారులు, సిబ్బందికి దాహార్తిని తీర్చేందుకు ఆపద్బాంధవులు ట్రస్ట్ సహకారంతో కలెక్టర్‌లోని సమావేశ మందిరం వద్ద ఏర్పాటు చేసిన మజ్జిగ సరఫరా కేంద్రాన్ని సోమవారం కలెక్టర్ లక్ష్మీశ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో నీటి సరఫరాకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎద్దడి ఉన్న ఆవాసాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. అవసరమైతే దాతల సహకారం తీసుకోవాలని అధికారులకు సూచించామన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.లక్ష్మీనర్సింహారావు, ఆపద్బాంధవులు ట్రస్ట్ చైర్మన్ కె.శ్రావణ్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మరో ఆల్‌టైమ్ రికార్డు దిశగా బెజవాడ రైల్వే

● ఈ ఏడాదిలో ఇప్పటి వరకు రూ.5,310 కోట్ల ఆర్జన

● 2023- 24లో రూ. 5,614 కోట్ల ఆర్జన

● మరో 20 రోజుల్లో రూ.302 కోట్ల సాధిస్తే ఆల్‌టైమ్ రికార్డు బ్రేక్



ఆంధ్రజ్యోతి, విజయవాడ: బెజవాడ రైల్వే డివిజన్ తన ఆల్‌టైమ్ రికార్డును తానే బద్దలు కొట్టేందుకు కూతవేటు దూరంలో ఉంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఫిబ్రవరి నెలాఖరుకు రూ.5,310 కోట్ల ఆదాయాన్ని సాధించింది. గత ఆర్థిక సంవత్సరం 2023-24 లో రూ. 5,614 కోట్ల మేర ఆదాయాన్ని సాధించి ఆల్‌టైమ్ రికార్డును నమోదు చేసింది. 2018-19లో అప్పటి ఆల్‌టైమ్ రికార్డును 2023-24లో బద్దలు కొట్టింది. ప్రస్తుతం కూడా అదే వేగంతో ముందుకు దూసుకుపోతోంది. ఈ ఆర్థిక సంవత్సరం ముగియటానికి మరో 20 రోజులు మాత్రమే ఉంది. గత ఏడాది సాధించిన ఆల్‌టైమ్ రికార్డు ఫీట్ రూ.5,614 కోట్లను దాటేందుకు సర్వశక్తులు ఒడ్డుతోంది. మరో రూ.302 కోట్లను ఈ 20 రోజుల్లో సాధిస్తే పాత రికార్డును బద్దలు కొట్టి సరికొత్త రికార్డును నెలకొల్పనుంది. డివిజన్ సాధించే ఆదాయంలో గణనీయంగా సరకు రవాణ ద్వారా సమకూరనుంది. తర్వాతి స్థానం ప్రయాణీకులదే. సరకు రవాణాలో కృష్ణపట్నం, కాకినాడ పోర్టులు కీలక పాత్ర పోషిస్తున్నాయి. గతేడాది సరకు రవాణా విభాగంలోనే రూ.4057 కోట్ల ఆదాయాన్ని సాధించటం మామూలు విషయం కాదు. ఈ ఏడాదిలో కూడా సరకు రవాణాలో విజయవాడ రైల్వే డివిజన్ దుమ్ము దులుపుతోంది.

ప్రేమ విఫలంతో యువతి ఆత్మహత్య

వత్సవాయి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అల్లూరిపాడు గ్రామంలో ప్రేమ విఫలం కావడంతో ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. గ్రామానికి చెందిన యలమర్తి సత్యనారాయణ - శైలజ భార్యభర్తలు. వీరికిద్దరు కుమార్తెలు పెద్ద కుమార్తె శ్రావణి, రెండో కుమార్తె కీర్తన. వారిని ఉన్నత చదువులు చదివించారు. శ్రావణి లండన్‌లో ఎమ్మెస్సీ చేస్తూ హైదరాబాద్‌కు చెందిన ఒక వ్యక్తిని ప్రేమించింది. 20రోజుల క్రితం స్వగ్రామం వచ్చిన ఆమె ఇంట్లో ఉన్న గడ్డిమందు సేవించి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. విజయవాడలో ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై ఉమామహేశ్వరరావు తెలిపారు.

బీద రవిచంద్రయాదవ్‌కు ఎమ్మెల్సీ ఇవ్వడం సముచితమే

● ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం కృతజ్ఞతలు

గుడివాడ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీగా బీద రవిచంద్రయాదవ్‌ను ఎంపిక చేయడం ద్వారా టీడీపీ యాదవులకు సముచిత స్థానం కల్పించిందని శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి హరికుమార్ పేర్కొన్నారు. సోమవారం ఏలూరురోడ్డులోని సంఘ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి కొలుసు పార్థసారథికి సంఘం తరఫున ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు జాజుల తాతారావు, మునీంద్ర, రామారావు పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతా

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము హామీ


11 వార్డులో రహదారిపై నిలిచిన మురుగును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా నక్కల కాలువ ప్రాంతంలో డ్రెయినేజీ సమస్య తీవ్రంగా ఉందని, దానికి శాశ్వత పరిష్కారం చూపుతానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము హామీ ఇచ్చారు. సోమవారం 11వ వార్డులో నక్కల కాలువ ప్రాంతంలో ఆయన పర్యటించారు. రహదారిపై పారుతున్న మురుగునీటిని పరిశీలించారు. సమస్యను పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట సయ్యద్ జబీన్, పట్టపు చిన్న, కరీముల్లా, సయ్యద్ గఫార్, వీరంకి వేణు, మోబిన్, ప్రకాశరావు, ప్రసాద్, నరసింహారావు, వెంకటేశ్వరరావు, శంకర్, రవి ఉన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. టీడీపీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'గత వైసీపీ ప్రభుత్వం డ్వాక్రా సంఘాలను నిర్వీర్యం చేసింది. వాటికి పూర్వవైభవం తీసుకురావడం కోసం కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది. 2025- 26 రాష్ట్ర బడ్జెట్‌లో మహిళ, శిశు సంక్షేమం కోసం రూ.4,338 కోట్లను కేటాయించింది.' అని ఎమ్మెల్యే అన్నారు. ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలోని మహిళలతో పాటు, కన్నతల్లి, తోడబుట్టిన చెల్లిని దగాచేసిన ఘనుడు జగన్మోహన్‌రెడ్డి అని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో ఉన్న మహిళలను అక్కాచెల్లెళ్లు అని పలికే అర్హత జగన్‌కు లేదన్నారు.

కబడ్డీ రాష్ట్ర పోటీలకు మొవ్వ, వెన్ననపూడి హైస్కూల్ విద్యార్థులు


రాష్ట్ర పోటీలకు ఎంపికయిన విద్యార్థులతో మొవ్వ హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం శివకోటేశ్వరరావు, పీడీలు

కూచిపూడి /నందివాడ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీలకు మొవ్వ, నందివాడ మండలం వెన్ననపూడి జడ్పీ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 14 నుంచి 16 వరకు పులివెందులలో నిర్వహించే 34వ రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారు. మొవ్వ హైస్కూల్ నుంచి బాలికల విభాగంలో నందేటి సంకీర్త, బాలుర విభాగంలో ఇంగువ ప్రదీప్ కుమార్, డేగల శ్యామ్యూల్, మెరుగుమాల బాలహర్షవర్దన్ ఎంపికయ్యారని పాఠశాల పీడీలు అప్పికట్ల రామారావు, మండలి మనోహరి తెలిపారు. పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను ఇన్‌చార్జి హెచ్‌ఎం పి.శివకోటేశ్వరరావు, ఉపాధ్యాయ కార్యదర్శి జాకీర్ అహ్మద్, ఉప కార్యదర్శి మేకా రాణి అభినందించారు. వెన్ననపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బొమ్మిడి నాగ చైతన్య, మేడేపల్లి నిహారిక కబడ్డీ రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయురాలు వీఎంఎస్ వాణి తెలిపారు. వారికి శిక్షణ ఇచ్చిన వ్యాయామోపాధ్యాయుడు పి.యేసురత్నం, విద్యార్థినులకు ఆమె అభినందించారు.

రూ.8 లక్షలతో సీసీ డ్రెయినేజీ నిర్మాణం


నార్తు దళితవాడలో నిర్మిస్తున్న సీసీ డ్రెయినేజీ

తోట్లవల్లూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): తోట్లవల్లూరు నార్తు దళితవాడలో మండల పరిషత్ నిధులు రూ.8 లక్షలతో సీసీ డ్రెయినేజీ నిర్మాణం చేపట్టారు. దళితవాడలోని ఇండేన్ గ్యాస్ గోడౌన్ రోడ్డులో 235 మీటర్ల పొడవున సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులు రెండు రోజులుగా నిర్వహిస్తున్నారు. అనుకున్నదానికంటే లోతు ఎక్కువైందని, ఓచోట సీసీరోడ్డు పగులకొట్టి డ్రెయినేజీ నిర్మించాల్సి వచ్చిందని, మరో రూ.3 లక్షల అంచనా పెరగొచ్చని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్బారావు తెలిపారు.



రోడ్లేశారు.. మార్జిన్ల అభివృద్ధి మరిచారు

మార్జిన్లు మెరకచేయకుండా వదిలేసిన పామర్రు అగ్నిమాపక కేంద్రం సీసీ రోడ్డు, కరణంగారి బజారు రోడ్డు

● ఇబ్బంది పడుతున్న పామర్రు ప్రజలు

(ఆంధ్రజ్యోతి-పామర్రు): గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణాలు జరిగి నెలలు గడుస్తున్నా అధికారుల పర్యవేక్షణ లోపించడంతో రోడ్లకు ఇరువైపులా మార్జిన్లను మెరక చేయకుండా కాంట్రాక్టర్లు వదిలేశారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లకు ఇరువైపులా ఎర్రమట్టితోగానీ, ఫ్లైయాష్‌తోగాని మెరక చేయాలని అలా వదిలేయడంతో అవి ప్రమాదకరంగా ఉన్నాయని వారంటున్నారు. అగ్నిమాపక కేంద్రం ఎదురుగా సీసీ రోడ్డుకు మార్జిన్ మెరకచేయకపోవడంతో గ్రామ సచివాలయానికి వెళ్లే గ్రామస్థులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇలానే వదిలేస్తే ఆనతి కాలంలోనే ఎంతో ఖర్చుతో నిర్మించిన సీసీ రోడ్లు దెబ్బతినే అవకాశముందని అంటున్నారు. అధికారులు స్పందించి రోడ్ల మార్జిన్లను కాంట్రాక్టర్లతో అభివృద్ధి చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వారంలోగా అభివృద్ధి చేయిస్తాం

నూతనంగా నిర్మించిన సీసీ రహదారులకు ఇరువైపులా మార్జిన్ల నిర్మాణం కోసం ఇప్పటికే కాంట్రాక్టర్లతో మాట్లాడాం. గ్రావెల్ దూర ప్రాంతం నుంచి రావాలి. దీని కారణంగా కొంత జాప్యం జరిగిన మాట వాస్తవమే. వారంలోగా మార్జిన్లను అభివృద్ధి చేయిస్తాం.

-రామారావు, పంచాయతీరాజ్ ఏఈ

కావలి గ్రీష్మపై వైసీపీ తప్పుడు ప్రచారం

● టీడీపీ నేత చింతపల్లి వెంకటేశ్వరరావు

తోట్లవల్లూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యావంతురాలైన కావలి గ్రీష్మను సీఎం చంద్రబాబునాయుడు ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించటాన్ని వైసీపీ జీర్ణించుకోలేక తప్పుడు ప్రచారం చేస్తోందని టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతపల్లి వెంకటేశ్వరరావు ఆరోపించారు. వల్లూరుపాలెంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేరస్వభావం కలిగిన వైసీపీకి అందరూ అలాగే కనిపిస్తుంటారని అన్నారు. గ్రీష్మ కుటుంబానికి ఎంతో గౌరవప్రదమైన చరిత్ర ఉందని, ఆమె తల్లి ప్రతిభాభారతి స్పీకర్‌గా పనిచేశారని, ఉన్నత విద్యావంతురాలైన గ్రీష్మ ఎమ్మెల్సీ కావటానికి అన్ని అర్హతలు ఉన్నాయని ఆయన అన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో మహిళలపై అత్యాచారాలు, అరాచకాలను జగన్ పట్టించుకోకపోవడాన్ని టీడీపీ మహానాడులో గ్రీష్మ ప్రశ్నించారని, దానిని వైసీపీ వక్రీకరించటం దారుణమని అన్నారు. దళిత డ్రైవర్‌ను చంపి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ అనంతబాబును నెత్తిన పెట్టుకుని పాలాభిషేకాలు చేసిన ఘనత, దళిత డాక్టర్‌ను పిచ్చోడిని చేసి చంపిన ఘనత వైసీపీదేనని, ఇలాంటి వైసీపీ పెద్దలకు కావలి గ్రీష్మ గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని వెంకటేశ్వరరావు అన్నారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ఆచంటి కోటిబాబు, బీసీ నాయకుడు ఏమినేని వెంకటేశ్వరరావు, సీహెచ్ పుల్లయ్య పాల్గొన్నారు.

మొవ్వ పరీక్షా కేంద్రం తనిఖీ

కూచిపూడి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మొవ్వ క్షేత్రయ్య జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని జిల్లా పరీక్షల కమిటీ(డీఈసీ) అధికారులు కె.నరసింహారావు, పి.నాగరవి, జిల్లా ప్రత్యేకాధికారి అరుణప్రభ పరిశీలించారు. 119 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా, 116 మంది హాజరయ్యారు. ముగ్గురు గైర్హాజరైనట్లు సీఎస్ డి.సుధాకర్, డీవో ఎం.వి.గంగాధర్‌రావుతెలిపారు.

పీ-4 సర్వే వేగవంతం చేయండి

● సచివాలయ ఉద్యోగులకు ఎంపీడీవో సూచన

పామర్రు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్వహిస్తున్న పీ-4 సర్వే, వర్క్‌ఫ్రమ్ హోమ్ సర్వేలను మరింత వేగవంతం చేయాలని సచివాలయ ఉద్యోగులకు ఎంపీడీవో కె.జ్యోతి సూచించారు. సోమవారం గ్రామకార్యదర్శులతో సర్వేలపై ఆమె సమీక్షించారు. పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు సర్వే తీరును పరిశీలించాలని ఆదేశించారు. సర్వేలో తప్పులు దొర్లకుండా చూసుకోవాలన్నారు.

సావిత్రీబాయి పూలేకు ఘన నివాళి


పూలే దంపతుల విగ్రహాలకు నివాళులర్పిస్తున్న స్టేడియం వాకర్స్ క్లబ్ సభ్యులు

గుడివాడ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): సావిత్రీబాయి పూలే వర్ధంతి సందర్భంగా సోమవారం మెయిన్ రోడ్డులోని జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే విగ్రహాలకు ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు లోయ ఈశ్వర వెంకటేశ్వరరావు, అధ్యక్షులు కోన రామారావు, కోశాధికారి తమ్మినేని రామ్మోహనరావు పాల్గొన్నారు.


మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు, ఈవోపీఆర్డీ, ఎంపీడీవో

పంచాయతీరాజ్ ఉద్యోగులపై దాడి అమానుషం

గుడివాడ రూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి మండలం నల్లబల్లి పంచాయతీ సిబ్బందిపై గ్రామస్థులు చేసిన దాడి అమానుషమని, దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం పేర్కొంది. దాడిని నిరసిస్తూ మండల పరిషత్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించింది. అనంతరం ఎంపీడీవో డి.వై.విష్ణుప్రసాద్‌కు వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడారు. సమయాన్ని పట్టించుకోకుండా విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందిపై దాడులు సరికాదని, పంచాయతీ రాజ్ సిబ్బందికి కూడా కుటుంబాలు ఉంటాయని గుర్తించాలనని కోరారు.

గంగానమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

గుడ్లవల్లేరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): గంగానమ్మ ఆలయ జీర్ణోద్ధరణలో భాగంగా సోమవారం వేదపండితులు ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. గ్రామస్థులు నవధాన్యాలు, నవరత్నాలు సమర్పించారు. వల్లభనేని వెంకట్రావు, కొసరాజు బాపయ్య చౌదరి, వల్లభనేని వెంకట సుబ్బారావుచౌదరి, ఈడ్పుగంటి ఉమామహేశ్వరరావు, కొసరాజు వెంకటాద్రి పాల్గొన్నారు.


హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

యువత పోరుతో ప్రభుత్వం కళ్లు తెరిపిస్తాం

● వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్

పామర్రు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలంటూ బుధవారం మచిలీపట్నంలో కలెక్టరేట్ వద్ద వైసీపీ ఆధ్వర్యంలో యువత పోరు కార్యక్రమం నిర్వహిస్తున్నామని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ శ్రేణులకు వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పిలుపునిచ్చారు. యువత పోరు కార్యక్రమంతో మొద్దు నిద్రపోతున్న కూటమి ప్రభుత్వం కళ్లు తెరిపిస్తామని ఆయన స్పష్టంచేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు అన్ని వర్గాలకు హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక వారిని నిలువునా కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. యువతకు ఉపాధి, నిరుద్యోగ భృతి ఇస్తామని నమ్మించి దగా చేశారని విమర్శించారు. ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్‌తో పోస్టర్లను ఆవిష్కరించారు.

బీసీ వసతి గృహాన్ని వినియోగంలోకి తీసుకురండి


మాట్లాడుతున్న సీపీఎం పట్టణ కార్యదర్శి ఆర్పీపీ రెడ్డి

గుడివాడ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ కాలనీలోని బీసీ సంక్షేమ వసతి గృహం శిథిలావస్థకు చేరిందని, ప్రభుత్వం దానిని వినియోగంలోకి తీసుకురావాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఆర్పీపీ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రజాచైతన్య యాత్రలో భాగంగా సోమవారం ఎన్టీఆర్ కాలనీలో నిరుపయోగంగా ఉన్న బీసీ వసతి గృహ పరిసరాలను ఆయన పరిశీలించారు. వసతి గృహ పరిసరాల్లో పిచ్చి మొక్కలు పెరగడంతో పాములకు ఆవాసంగా మారిందన్నారు. వసతి గృహాన్ని బాగు చేయాలని లేని పక్షంలో శిథిలావస్థలో ఉన్న వసతిగృహాన్ని పడగొట్టి ఆట స్థలంగా మార్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు లంకా సురేంద్ర, రేపాని కొండ, ఐద్వా కార్యదర్శి పి.రజిని పాల్గొన్నారు.

పర్నాసలో అనర్హుల పింఛన్లు తొలగించండి

● డీటీ రామశివకు జడ్పీటీసీ సభ్యుడు గోళ్ల రామకృష్ణ వినతి


డిప్యూటీ తహసీల్దార్ కట్టా రామశివకు వినతిపత్రం అందజేస్తున్న జడ్పీటీసీ సభ్యుడు గోళ్ల రామకృష్ణ

గుడివాడ రూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పర్నాస గ్రామంలో అనర్హుల పింఛన్లు తొలగించాలని సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కట్టా రామశివకు జడ్పీటీసీ సభ్యుడు గోళ్ల రామకృష్ణ వినతిపత్రం అందజేశారు. గ్రామంలో అనర్హులు ఉన్నారని వెరిఫికేషన్‌లో గుర్తించినప్పటికీ కొన్ని నెలలుగా వారికి పింఛన్లు అందజేస్తున్నారని, వాటిని నిలిపివేయాలని కోరారు. సాధికార సర్వేలో అనర్హులకు పింఛన్లు ఇవ్వవొద్దని తెలిపినా కొంతమంది అధికారులు పింఛన్లు అందిస్తున్నారని తెలిపారు. పంచాయతీ ఊర చెరువులో కొంతమంది సెప్టిక్ ట్యాంక్‌లు పెట్టడం వల్ల చెరువు పాడవుతోందన్నారు. చెరువు పాడుకున్న వ్యక్తులు వదిలి వెళ్లిపోయారని తెలిపారు. పర్నాసకు ఊరు మధ్యలో ఉన్న ఏకైక చెరువు ఇదని, పంచాయతీకి ఆదాయం పోతోందని తెలిపారు. చెరువులోకి పెట్టిన సెప్టిక్ ట్యాంక్‌లు తీసేయాలని కోరారు. ప్రభుత్వ పింఛన్లు, రేషన్ కార్డులు అనర్హులకు ఉన్నాయని వాటిని తొలగించాలన్నారు. కల్వపూడి అగ్రహారం జాతీయ రహదారి నుంచి రెడ్డిపూడి వరకు లేళ్లపూడి చానల్ పూడికతీయించాలని, ఆక్రమణలు తొలగించాలని కోరారు.

ఉనిఫెస్ట్‌లో ఏఎన్నార్ ఎంబీఏ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీజేఎస్ కుమార్

గుడివాడ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఏషియన్ కాలేజ్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ యునైటెడ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్, బిజినెస్ మేనేజ్‌మెంట్ విజయవాడ నిర్వహించిన ఉనిఫెస్ట్ 2కె 25లో అక్కినేని నాగేశ్వరరావు కళాశాల ఎంబీఏ విద్యార్థులు ద్వితీయస్థానంలో నిలిచారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీజేఎస్ కుమార్ తెలిపారు. సోమవారం కళాశాలలో ప్రతిభ చాటిన విద్యార్థులను ఆయన అభినందించారు. క్విజ్ విజ్ పోటీల్లో విద్యార్థులు బి.పల్లవి, వి.నేతాజీ, ఎన్.సాయిభరత్, బ్రాండ్ రేసు పోటీలో డి.బిందులక్ష్మి, అబ్దుల్ నగీన, ఎ.లీలానాగకుమార్‌లు ద్వితీయస్థానాల్లో నిలిచారని తెలిపారు. పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్ఆర్కే ప్రసాద్, కేఏస్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ, ఎంబీఏ విభాగాధిపతి సువర్చల అభినందించారు.

15 నుంచి ఉమానాగలింగేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

గుడివాడ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): బైపాస్‌రోడ్డులోని ఉమానాగలింగేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 15వ తేదీన 16వవార్షిక బ్రహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు దేవస్థాన ధర్మకర్త గంటా రాజుస్వామి పేర్కొన్నారు. సోమవారం రాటా ప్రతిష్ఠా పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. బ్రహోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం దేవస్థానంలో విశేష హోమ పూజా కార్యక్రమాలు, స్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహిస్తామని ధర్మకర్త రాజు తెలిపారు. కార్యక్రమంలో వేదపండితులు గౌతమి, శైలేంద్ర, శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

టిడ్కో కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

గుడివాడ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మల్లాయిపాలెం శివారు టిడ్కో కాలనీలో పేరుకుపోయిన సమస్యలపై ఎమ్మెల్యే వెనిగండ్ల రాము దృష్టి సారించాలని, వాటిని పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి ఆర్పీపీ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కాలనీలో పర్యటించి ఆయన చెత్తను తొలగించారు. గతంలో టీడీపీ హయాంలో టిడ్కో గృహాల నిర్మాణం చేపట్టారన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ నిర్లక్ష్యంగా వ్యవహరించి, ఎన్నికల ముందు మౌలిక వసతులు కల్పించకుండా హడావుడిగా ప్లాట్లను లబ్ధిదారులకు అందజేశారన్నారు. నేడు మంచినీళ్లకు కూడా కాలనీవాసులు కటకటలాడుతున్నారన్నారు. ఎక్కడ పడితే అక్కడే చెత్త దర్శనమిస్తోందని, ఎమ్మెల్యే స్పందించి వెంటనే సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు. పి.రజిని, లంకా సురేంద్ర, కాలనీవాసులు పాల్గొన్నారు.


చెత్తను తొలగిస్తున్న సీపీఎం నాయకులు

గంగానమ్మ విగ్రహం ధ్వంసం చేసిన వ్యక్తికి ఏడాది జైలు

చల్లపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : గంగానమ్మ విగ్రహం ధ్వంసం చేసిన వ్యక్తికి ఏడాది జైలుశిక్ష విధిస్తూ మొవ్వ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ పి.రాజన్‌ఉదయ్ ప్రకాష్ సోమవారం తీర్పునిచ్చారు. లక్ష్మీపురం శివారు చింతలమడలో ఘంటసాల నాగబాబు అనే వ్యక్తి 2019 అక్టోబరు 14న మద్యం తాగి గ్రామదేవత గంగానమ్మ విగ్రహం ధ్వంసం చేశాడు. ఇదేమని ప్రశ్నించిన వారిని దుర్భాషలాడడంతో అప్పటి ఎస్సై పి.నాగరాజు కేసు నమోదు చేశారు. నిందితుడిపై నేరం రుజువు కావటంతో ఏడాది జైలు శిక్ష, పది వేల రూపాయల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ఏపీపీ పి.తాండవకృష్ణ ప్రాసిక్యూషన్‌గా వ్యవహరించారు.



జోశ్యులవారి తోట రామాలయంలో ప్రతిష్ఠించిన సీతారాములు పాలరాతి విగ్రహాలు

భక్తిశ్రద్ధలతో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

● జోశ్యులవారితోటలో మార్మోగిన రామనామం ● భారీ అన్నసమారాధన

మచిలీపట్నం టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : బందరు నగరంలో మూడో వార్డు జోశ్యులవారితోటలోని పునర్నిర్మిత రామాలయంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ సోమవారం భక్తిశద్ధలతో జరిగింది. గత మూడురోజులుగా స్వామి వార్ల విగ్రహాలకు బ్రహ్మశ్రీ విష్ణుభొట్ల సూర్యనారాయణ శర్మ ఘనాపాఠి ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. సోమవారం గణపతిపూజ, పుణ్యాహవచనం, మూలమంత్ర హోమాలు జరిగాయి. ఉదయం గం.9.12లకు సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి పాలరాతి విగ్రహాల ప్రతిష్ఠ శాస్త్రోక్తంగా జరిగింది. పూర్ణాహుతి అనంతరం నాలుగు వేల మంది భక్తులకు అన్నసమారాధన జరిగింది. కమిటీ అధ్యక్షుడు గొర్రె హరిబాబు, ఉపాధ్యక్షుడు పుప్పాల శివకుమార్, సెక్రటరీ డి.వి.సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ పుప్పాల బాల అంజనేయ సూర్యప్రసాద్, కోశాధికారి కొలసాని శ్రీహరి, కార్యవర్గ సభ్యులు గోపిశెట్టి చిత్తరంజన్ ఫణిధర్, బుద్దన నాగ వెంకట కిషోర్‌కుమార్, రావి మౌలాలి, గొర్రె వెంకట రత్నం (రాము), బుద్దన మస్తాన్‌బాబు (బాబి), రావి మణికంఠ, దేవనబోయిన రవి పర్యవేక్షించారు.



పులిగడ్డ కనకదుర్గ ఆలయంలో తొలిరోజు ప్రతిష్ఠా పూజల్లో పాల్గొన్న మహిళలు

కనకదుర్గమ్మ దేవాలయంలో ప్రతిష్ఠా పూజలు ప్రారంభం

అవనిగడ్డ రూరల్ : పులిగడ్డ కనకదుర్గమ్మ దేవస్థానంలో విగ్రహ, జీవధ్వజ పునః ప్రతిష్ఠ పూజ లు సోమవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. ఆలయ నిర్వాహకులు మండలి వెంకట కృష్ణారావు (బాబు), పలువురు దంపతులు పాల్గొని యంత్ర స్నాపన, పుణ్యాహవచనం, యాగశాల అర్చన తదితర పూజలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. మంత్ర పుష్పంతో తొలిరోజు కార్యక్రమాలు పూర్తయ్యాయి.

రాయచోటిలో హిందువులపై దాడిని నిరసిస్తూ ధర్నా

మచిలీపట్నం టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : అన్నమయ్య జిల్లా రాయచోటిలో వీర భద్ర స్వామి పార్వేటి ఉత్సవ ఊరేగింపు లో హిందువులపై జరిగిన దాడిని నిరసిస్తూ సోమవారం కలెక్టరేట్ వద్ద విశ్వహిందూ పరిషత్, బీజేపీ నాయకులు ధర్నా నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ నాయకులు శ్రీకాంత్, బీజేపీ నాయకులు పంతం గజేంద్ర, ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, అయోధ్య రామయ్య, కూనపరెడ్డి శ్రీనివాస్ తదితరులు ధర్నాలో పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. హిందువులను రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించిన రాయచోట్ అర్బన్ స్టేషన్ ఎస్సై జి నరసింహారెడ్డిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విశ్వహిందూ పరిషత్ ప్రాంత ప్రముఖుడు పి.వి.ఎస్. నాయుడు, వర్రె రాజశేఖర్, భజరంగదళ్ శ్రీరామ్, ఆర్‌ఎస్‌ఎస్ నాయ కుడు బూరగడ్డ సృజయ్, వడ్డె కృషి, తదితరులు పాల్గొన్నారు.



హిందువులపై దాడిని నిరసిస్తూ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న బీజేపీ, వీహెచ్‌పీ కార్యకర్తలు

వైసీపీ నుంచి జనసేనలోకి చేరిక

మోపిదేవి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ ఆవిర్భావ సభ విజయోత్సవంలా జరుగబోతుందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సన్నాహక సభ ఆదివారం రాత్రి మోపిదేవిలో నిర్వహించారు. ఉమ్మడి కృష్ణా జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కోసూరు వారిపాలెం, కె.కొత్తపాలెం, కొక్కిలిగడ్డ, మోపిదేవి గ్రామాలకు చెందిన వైసీపీ కార్యకర్తలు భారీ సంఖ్యలో జనసేన పార్టీలో చేరారు. బుద్ధప్రసాద్ వారికి జనసేన పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కోసూరువారిపాలెం నుంచి గ్రామ సర్పంచ్ కోసూరు అనూష, ఎంపీటీసీ సభ్యుడు సనకా వెంకట రాజేష్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కామిశెట్టి సురేష్‌బాబులతో సహా పలువురు మాజీ ప్రజాప్రతినిధులు జనసేన పార్టీలో చేరటంతో వైసీపీకి భారీ షాక్ తగిలినట్లైంది. మండల పార్టీ అధ్యక్షులు పూషడపు రత్నగోపాల్, మచిలీపట్నం జనసేన పార్టీ పరిశీలకులు బండి రామకృష్ణ తదితరులు సమావేశంలో ఉన్నారు.

నంగేగడ్డలో తుమ్మచెట్లు నరికివేత

నాగాయలంక, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : నంగేగడ్డ పంచాయతీలో తుమ్మ చెట్లను అనుమతి లేకుండా నరికి వేశారు.సంపద కేంద్రానికి వెళ్లే రహదారిలో ఉన్న రెండు తుమ్మ చెట్లను కోసి గుట్టగా పడేశారు. గ్రామానికి చెందిన వ్యక్తే ఈ చెట్లను నరికినట్లు తెలిసింది. ఈ విషయమై తహసీల్దార్ ఎం.హరనాథ్‌ను వివరణ కోరగా, ఈ విషయం తన దృష్టికి వచ్చిందని నిందితుడిని గుర్తించి కేసు నమోదు చేస్తామని ఆయన తెలిపారు.





శిథిలమైన మంగళాపురం పశువైద్యశాల భవనం

సిబ్బంది విధులు నిర్వహించే గది, ఇన్‌సెట్లో పెచ్చులూడిన శ్లాబు

శిథిల పశువైద్య భవనాల్లో విధులు

● సిబ్బంది బిక్కుబిక్కు

(ఆంధ్రజ్యోతి-చల్లపల్లి)

వ్యవసాయం తర్వాత అంతటి ప్రాధాన్యత కలిగిన రంగం పాడిపరిశ్రమ. పాడిపరిశ్రమలో ప్రధానంగా పశు ఆరోగ్యం కోసం వైద్యం అందించే పశువైద్యశాలల భవనాలు గ్రామీణ ప్రాంతాల్లో శిథిలావస్థలో దర్శనమిస్తున్నాయి. మంగళాపురంలోని పశువైద్యశాల భవనం దాదాపుగా పదేళ్లుగా శిథిలావస్థలోనే దర్శనమిస్తోంది. శ్లాబ్ పెచ్చు లూడినప్పటికీ అనువుగా ఉన్న ఒకటి రెండు గదుల్లోనే వెటర్నరీ సిబ్బంది విధులు నిర్వహిస్తున్న పరిస్థితి నెలకొంది. మంగళాపురం పశువైద్యశాలలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్‌గా ఎండి.ఫైజాన్ విధులు నిర్వహిస్తున్నారు. జూనియర్ వెటర్నరీ అధికారి విధులు నిర్వహించాల్సి ఉండగా గతంలో అధికారి డిప్యుటేషన్‌పై వెళ్లిపోవటంతో అప్పటి నుంచి ఎల్‌ఎస్‌ఏ విధులు నిర్వహిస్తున్నారు. లక్ష్మీపురంలో సైతం ఎల్‌ఎస్‌ఏ లేకపోవటంతో రెండు గ్రామాల్లోని గ్రామీణ పశువైద్యకేంద్రాల్లో ఫైజాన్ ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు. మంగళాపురంలో పూర్తి శిథిలమైన భవనంలో ఒక పెద్ద గది, అనుబంధంగా ఉన్న మరో చిన్నగదిని ఉపయోగించుకుంటున్నారు. శ్లాబ్ పెచ్చులూడి పడిపోగా, భవనం ఎప్పుడు కూలుతుందో అనే భయం నెలకొంది. మందులు భద్రపరచుకునేందుకు బీరువాను ఒక గదిలో ఉంచగా, ఒక గదిలో ఎల్‌ఎస్‌ఏ కూర్చుకునేందుకు కుర్చీ, టేబుల్, పశువైద్యానికి అవసరమైన పరికరాలు ఇతరత్రా సామాన్లు ఉంచారు. వరండా, ఆరు గదులున్న ఆసుపత్రి భవనం పూర్తిగా శిథిలమైపోయింది. అదే భవనంలో ఆసుపత్రిని కొనసాగించాల్సిన దుస్థితి ఏర్పడింది. వ్యవసాయం, పశుపోషణ ప్రధాన వృత్తిగా ఉండే మంగళాపురంలో సుమారుగా 900 పైగా గేదెలు, ఆవులు, ఎద్దులు ఉండగా, గొర్రెలు, మేకలు 700 పైగా ఉన్నాయి. పాడిపోషణ, గొర్రెల మేకల పెంపకానికి ప్రధాన గ్రామమైన మంగళాపురంలో పశువైద్యశాలను నిర్మించటంతోపాటు జూనియర్ వెటర్నరీ అధికారిని పూర్తిస్థాయిలో నియమించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ప్రభుత్వం నిధులు మంజూరు చేయకున్నా ప్రజాప్రతినిధులు తమ అభివృద్ధి నిధులు కేటాయించైనా భవన నిర్మాణానికి చొరవచూపాలి.

జేడీ డాక్టర్ చిననరసింహులు వివరణ

మంగళాపురం పశువైద్యశాల నూతన భవనం నిర్మాణం అంశాన్ని ప్రభుత్వానికి నివేదించాం. గత కొంతకాలంగా నూతన భవన నిర్మాణాలకు ప్రత్యేకంగా నిధులు మంజూరు జరగటం లేదు. స్థానికంగా గ్రామ పంచాయతీ నిధులు కేటాయించి నూతన భవన నిర్మాణం చేపట్టవచ్చు. ప్రజావిజ్ఞప్తులతో ఎమ్మెల్యే, ఎంపీ నిధులు కేటాయించేలా కృషిచేయాల్సి ఉంది. కొన్ని గ్రామాల్లో స్వచ్ఛంద సంస్థల సహకారంతో నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ విషయంలో మా వంతు కృషి చేస్తాం.



కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేస్తున్న వెంకటేశ్వరప్రసాద్

డీపీఆర్వో వెంకటేశ్వరప్రసాద్ బాధ్యతల స్వీకారం

● కలెక్టర్‌తో భేటీ

మచిలీపట్నం టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారిగా ఎం. వెంకటేశ్వర ప్రసాద్ సోమవారం తిరిగి విధుల్లో చేరారు.

మూడు నెలల అర్జిత సెలవులో వెళ్లిన ఆయన మినీ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ డీకే బాలాజీని మర్యాద పూర్వకంగా కలిశారు. ఇప్పటి వరకు పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహించిన ఎస్.వి. మోహనరావు నుంచి బాధ్యతలు స్వీకరించారు.

నిర్ణయాధికారంలో మహిళల భాగస్వామ్యం పెరగాలి



సమావేశంలో మాట్లాడుతున్న మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని

చల్లపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : నిర్ణయాధికారంలో మహిళల భాగస్వామ్యం పెరగాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెనుమత్స దుర్గాభవాని అన్నారు. చంద్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో ఏపీ మహిళా సమాఖ్య జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం అంతర్జాతీయ మహిళా దినోత్సవం, సావిత్రిబాయి పూలే వర్ధంతి సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న దుర్గాభవాని మాట్లాడుతూ, మహిళల రక్షణగా ఎన్ని చట్టాలు ఉన్నా అవి నిరుపయోగంగానే ఉంటున్నాయన్నారు. మహిళలు తమ హక్కుల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. లింగ సమానత్వం కోసం మహిళాశక్తి సంఘటిత పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మల్లుపెద్ది రత్నకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వివేకానంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పెమ్మసాని రమేష్‌బాబు, మహిళా నేతలు దేవభక్తుని నిర్మల, కంచర్ల ప్రభుకుమారి, కంఠంనేని జ్యోత్స్నాదేవి, సీపీఐ నేత మాలెంపాటి కాంచనరావు ప్రసంగించారు. మహిళలు గౌరవంగా జీవించే హక్కు దాతృత్వం కాదు - ఇది మన హక్కు అనే అంశంపై విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు నగదు పురస్కారాలను అందించారు. జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, చంద్ర రాజకుమారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఆర్ అండ్ బీ స్థలంలో విగ్రహం ఏర్పాటు నిలిపివేత

పెడన, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : పెడన పోలీసు స్టేషన్‌కు సమీపంలోని ఆర్ అండ్ బీకి చెందిన స్థలంలో విగ్రహం ఏర్పాటును అధికారులు అడ్డుకున్నారు. ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు ఆదివారం రాత్రి ఆర్ అండ్ బీ స్థలంలో దేశ మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు పిల్లర్లు నిర్మించారు. సమాచారం అందుకున్న కమిషనర్ ఎం. గోపాలరావు, టీపీవో బళ్ల సుజనకుమారి, సీఐ కె. నాగేంద్రప్రసాద్, ఎస్సై జి. సత్యనారాయణ, ప్లానింగ్ సెక్రటరీ లు విగ్రహం ఏర్పాటు చేయనున్న స్థలం వద్దకు చేరుకున్నారు. విగ్రహం ఏర్పాటుకు మునిసిపాలిటీ అనుమతులు తప్ప నిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా నేతకు, అధికారులకు మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. అనంతరం అధికారులు మునిసిపాలిటీ అనుమతులు లేనందున పిల్లర్లు తొలగిస్తున్నామని చెప్పి ఎక్స్‌కవేటర్ సహాయంతో పిల్లర్లను తొలగించారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ స్వాధీనం

అవనిగడ్డ రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : పాత ఎడ్లంక సొసైటీ భూముల నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్‌ను రెవెన్యూ అధికారులు పట్టుకుని, ట్రాక్టర్ యజమానికి రూ.5 వేలు జరిమానా విధించినట్లు తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు తెలిపారు.



విజ్ఞానాంశాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఆకట్టుకున్న సైన్సు ప్రదర్శన

మచిలీపట్నం టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం స్టార్ స్కూల్‌లో సోమవారం విద్యార్థులు ప్రదర్శించిన సైన్సు ఎగ్జిబిట్లు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై ప్రదర్శించిన ఎగ్జిబిట్లు అందర్నీ ఆలోచింప చేశాయి. సోలార్ ఎనర్జీ, చంద్రయాన్ వంటి 120 అంశాలను ప్రదర్శించారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మచిలీపట్నం శాఖ అధ్యక్షుడు, స్టార్ విద్యాసంస్థల అధినేత శ్రీరామ్, అయ్యప్పస్వామి, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా సమయం కుదింపు

పెడన, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో తాగునీటి సరఫరా సమయాన్ని కుదించినట్లు కమిషనర్ ఎం. గోపాలరావు తెలిపారు. రక్షిత మంచినీటి పథకం ఫిల్టర్‌బెడ్ మరమ్మతు పనులు జరుగుతున్నందున తాగునీటి సరఫరా సమయాన్ని కుదించామన్నారు.

నాగాయలంక జలక్రీడల కేంద్రం పనుల ప్రారంభం నేడు

అవనిగడ్డ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : నాగాయలంకలోని జలక్రీడల శిక్షణా కేంద్ర నిర్మాణ పనులను మంగళవారం కలెక్టర్ డికె.బాలాజీ పునఃప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 2018లో నాటి టీడీపీ ప్రభుత్వం జలక్రీడలను ప్రోత్సహించేందుకు నాగాయలంకను అనువైన ప్రాంతంగా గుర్తించి భవన నిర్మాణం ప్రారంభించిందన్నారు. నిర్మాణ పనులు వైసీపీ పాలనలో అటకెక్కాయన్నారు. జలక్రీడల కేంద్రంలో నాగిడి గాయత్రి శిక్షణ పొంది జాతీయ స్థాయిలో స్వర్ణ పతకంతోపాటు పలు పతకాలు సాధించి గర్వకారణంగా నిలిచిందన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, జిల్లా మినరల్ ఫౌండేషన్ ట్రస్టు నుంచి రూ.2 కోట్లు మంజూరు చేశారని, మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టర్ పనులను పునః ప్రారంభిస్తారని ఆయన వివరించారు

రెగ్యులేటర్ పనుల పరిశీలన

అవనిగడ్డ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డలో స్టేట్ డిజాస్టర్ అండ్ మిటిగేషన్ నిధులతో జరుగుతున్న మెయిన్ రెగ్యులేటర్ పనులను తూర్పు కృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు సోమవారం పరిశీలించారు. అవనిగడ్డ, నాగాయలంక మండలాలకు సాగు, తాగునీటిని అందించే రెగ్యులేటర్ పనులకు రూ. 39 లక్షలు మంజూరయ్యాయి. నాణ్యతతో పనులు పూర్తి చేయాలని సూచించారు. ఇరిగేషన్ డీఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు, డీసీ వైస్ చైర్మన్ రఘునాథ్, నీటి సంఘం అధ్యక్షుడు దాసినేని శ్రీనివాస్ పాల్గొన్నారు.



రెగ్యులేటర్ పనులు పరిశీలిస్తున్న దేవనబోయిన

ఎమ్మెల్యే అవినీతిపై పోరాడుతూనే ఉంటా : సింహాద్రి

అవనిగడ్డ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ అవినీతిని ఎండగడుతూనే ఉంటానని, ఎలాంటి బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నా రు. వైసీపీ కార్యాలయంలో యువత పోరు పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ, తొమ్మిది నెలల కాలంలో కూటమి ప్రభుత్వం చేసిందేమి లేదన్నారు. వైసీపీ పాలనను విమర్శించటమే పనిగా పెట్టుకోవటం హాస్యాస్పదంగా ఉందన్నారు. నలుకుర్తి రమేష్, చింతలపూడి లక్ష్మీనారాయణ, సింహాద్రి వెంకటేశ్వరరావు, రేపల్లె శ్రీనివాసరావు, నలుకుర్తి పృథ్వీరాజ్, మద్ది వెంకట నారాయణ, చింతలపూడి బాలభాస్కరరావు, ఇంకొల్లు శేషగిరి, గుంటూరు సురేష్, యాసం శివ, గరికపాటి కృష్ణారావు పాల్గొన్నారు.



సీఎం సహాయం నిధి చెక్కుల పంపిణీ

మచిలీపట్నం టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజలందరూ ఆరోగ్యవంతమైన జీవనం గడపాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు హసీంబేగ్ అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సీఎం సహాయనిధి చెక్కులను హసీంబేగ్ సోమవారం అందజేశారు. హసీంబేగ్ మాట్లాడుతూ, ఎనిమిది నెలల కాలంలో మంత్రి కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో 106 మందికి రూ. 1,65,03,668 ఆర్థిక సాయం అందజేశారన్నారు. 21 మందికి ఎల్‌వోసీ రూపంలో రూ.67, 95, 220, రీయింబర్స్‌మెంట్ రూపంలో 85 మందికి రూ. 97,08,446 అందజేశారన్నారు.

స్వచ్ఛ బందరును సాకారం చేస్తాం

మచిలీపట్నం టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ బందరు కలను సాకారం చేసేందుకు మంత్రి కొల్లు రవీంద్ర బృహత్తర ప్రణాళిక రూపొందించారని మునిసిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ పల్లపాటి సుబ్రహ్మణ్యం, నగర టీడీపీ కార్యదర్శి పిప్పళ్ళ కాంతారావు పేర్కొన్నారు. అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. అభివృద్ధిని గాలికొదిలేసి జేబులు నింపుకున్న వైసీపీ నాయకులు డ్రైనేజీ పనులు సక్రమంగా చేయలేదన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో మచిలీపట్నం రూపురేఖలు మార్చేందుకు ప్రయత్నిస్తుంటే మాజీ మంత్రి పేర్ని నాని అనుయాయులు అబద్ధాలతో ప్రచారం చేస్తున్నారన్నారు. ఆక్రమణలు తొలగించడం ద్వారా మురుగునీటి సమస్య నుంచి విముక్తి కల్పించేందుకు మంత్రి కొల్లు రవీంద్ర కృషి చేస్తున్నారన్నారు. నగర టీడీపీ అధ్యక్షుడు ఎండి ఇలియాస్ పాషా, కార్యదర్శి పిప్పళ్ల వెంకన్న, టీడీపీ కార్పొరేటర్లు దేవరపల్లి అనిత, దింటకుర్తి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేకు నివాళి

అవనిగడ్డ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా పోరాడిన సావిత్రిబాయి పూలే వర్ధంతిని గాంధీక్షేత్రంలో నిర్వహించారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి కొల్లూరి వెంకటేశ్వరరావు, కర్రా సుధాకర్, రామ్మోహనరావు, బండ్రెడ్డి హరి, రామదాసు, చిన్నా, హరిబాబు, పిచ్చియ్య పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

చల్లపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి మండలం పురిటిగడ్డకు చెందిన జంపాన అనూరాధ మనస్తాపంతో పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. సకాలంలో చల్లపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించగా, ప్రాణాపాయం నుంచి బయటపడింది. ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.